తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం – 26 – నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 172 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ సిద్ధం

- *డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీల నిర్వహణ*
- *ఎల్బీ స్టేడియంలో ప్రారంభం.. గచ్చిబౌలిలో ముగింపు వేడుకలు*
- *27 క్రీడాంశాల్లో 861 మంది రాష్ట్ర క్రీడాకారుల ప్రాతినిధ్యం*
- *నిర్వహణకు రూ.203 కోట్లు.. ప్రపంచస్థాయి వసతుల కల్పన*
- *సీఎం రేవంత్ రెడ్డి*

హైదరాబాద్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ భవిష్యత్తులో రాష్ట్ర క్రీడారంగానికి బలమైన పునాదిగా నిలుస్తాయని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్రంలో తొలిసారిగా జరగనున్న ఈ పోటీల ఏర్పాట్ల పురోగతి పై మంత్రి వాకిటి శ్రీహరితో పాటు వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా డిసెంబర్ 11న ప్రారంభ వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంతో పాటు పోటీలు జరిగే జిల్లాల్లోనూ పండుగ వాతావరణం కనిపించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభ వేడుకలను ఎల్బీ స్టేడియంలో, ముగింపు వేడుకలను గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ రెండు కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పగించాలని ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో పోటీలు జరగనున్నందున ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమించి ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. హైదరాబాద్‌కు పొన్నం ప్రభాకర్, రంగారెడ్డికి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మహబూబ్‌నగర్‌కు జూపల్లి కృష్ణారావు, వరంగల్‌కు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కరీంనగర్‌కు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఖమ్మంకు తుమ్మల నాగేశ్వరరావు, నిజామాబాద్‌కు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డిని బాధ్యులుగా నియమించాలని సూచించారు. స్టేడియంల పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. అభివృద్ధి పనులపై విజిలెన్స్ నిఘా ఉండాలని, క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా స్టేడియాలకు సంబంధించిన పనులన్నీ, 27 క్రీడాంశాలకు అవసర మైన పరికరాల

మిగతా 2 లో..



డ్రగ్స్ రహిత భారత్ కోసం పాదయాత్ర

- *అంబర్‌పేట మహంకాళి ఆలయం వద్ద మూడు రోజుల యాత్రకు శ్రీకారం*
- *విద్యార్థులు, యువత, ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమం*
- *డ్రగ్స్ తయారీ, సరఫరా చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపు*
- *వ్యసనానికి బానిసైన యువతకు చికిత్స, పునరావాసం కల్పించాలన్న కేంద్ర మంత్రి*

హైదరాబాద్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):

దేశంలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టి, యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడాలనే లక్ష్యంతోకేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో మూడు రోజుల పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో అంబర్‌పేటలో ప్రారంభమైన ఈ యాత్రకు విద్యార్థులు, యువత, స్థానిక ప్రజల నుంచి స్పందన లభించింది. అంబర్‌పేట మహంకాళి ఆలయం వద్ద అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న అనంతరం ఆయన పాదయాత్రను ప్రారంభించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజల్లో అవగాహన పెంచడం, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ యువత దేశానికి అతిపెద్ద ఆస్తి అని, వారి శక్తి, సామర్థ్యాలు దేశాభివృద్ధికి ఉపయోగపడాలని అన్నారు. అయితే మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వ్యసనం వ్యక్తిగత జీవితానికే పరిమితం కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఈ సమస్యను ఒక్క ప్రభుత్వంతోనే పరిష్కరించడం సాధ్యం కాదని, ప్రజలు,

మిగతా 2 లో..

పౌల్ట్రీ రంగానికి సింగిల్ విండో అనుమతులు



- *గ్రామీణ ప్రాంతాల్లోనూ వేగంగా అనుమతుల మంజూరుకు చర్యలు*
- *ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక కన్వెన్షన్ సెంటర్‌కు భూకేటాయింపు హామీ*
- *మొక్కజొన్న, సోయాబీన్ సరఫరాపై 48 గంటల్లో నిర్ణయం ..*
- *పౌల్ట్రీని ప్రాధాన్యత పరిశ్రమగా గుర్తిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి*

హైదరాబాద్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. పరిశ్రమ స్థాపనకు అవసరమైన అనుమతుల విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా సమగ్ర విధానాన్ని రూపొందించి సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీ ఫారాల ఏర్పాటుకు అనుమతులు, భూమి మార్పిడి వంటి ప్రక్రియల్లో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తామన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో 2026ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తమ ఉత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు పొందడం ఆలస్యమవుతోందని పౌల్ట్రీ రంగ ప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పట్టణాల్లో బిల్డ్‌నౌ యాప్ ద్వారా అమలు చేస్తున్న సింగిల్ విండో అనుమతుల విధానాన్ని త్వరలో గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తామని చెప్పారు. పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలతో ముందుకు వస్తే భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన భూమిని కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు తమ ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

పౌల్ట్రీ పరిశ్రమకు కొన్నిసార్లు మార్కెట్ ఒడిదుడుకులు, ఉత్పత్తి వ్యయాల పెరుగుదల వంటి సమస్యలు ఎదురవుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా కోళ్ల దాణా తయారీలో కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తినప్పుడు ప్రభుత్వం సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాల నిల్వలు, పౌరసరఫరాల శాఖ వద్ద అందుబాటులో ఉన్న నిల్వలను పరిశీలించి పౌల్ట్రీ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సరఫరా చేసే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. బహిరంగ మార్కెట్‌లో విక్రయించే బదులు అవసరమైన మేరకు పరిశ్రమకు అందించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ నిల్వలు ఎంత ఉన్నాయి, ఏ ధరకు సరఫరా చేయవచ్చనే అంశాలపై వ్యవసాయ శాఖ మంత్రితో సమీక్షించి 48 గంటల్లో నిర్ణయం తీసుకోవాలని వాకిటి శ్రీహరికి వేదికపైనే సూచించారు.

పౌల్ట్రీ పరిశ్రమ రైతులకు, రైతు కూలీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మేలు చేస్తోందని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. రైతులు పండించే మొక్కజొన్న, సోయాబీన్‌తో పాటు నూకలు, తౌడు వంటి ఉప ఉత్పత్తులను కూడా ఈ పరిశ్రమ కొనుగోలు చేస్తోందని తెలిపారు. తెలంగాణలో ప్రతి రోజూ సుమారు 5.30 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయని, తద్వారా ప్రజలకు ప్రోటీన్ అందించడంలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి మూడు గుడ్లతో పాటు చికెన్‌తో కూడిన భోజనాన్ని అందించడంలోనూ పౌల్ట్రీ రంగం సహకారం ఉపయోగపడుతోందని చెప్పారు. ఐటీ, ఔషధ, రక్షణ రంగాలతో పాటు పౌల్ట్రీ పరిశ్రమను కూడా ప్రభుత్వం ప్రాధాన్యత రంగంగా గుర్తిస్తోందన్నారు. పరిశ్రమ సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

తెలంగాణలో పెట్టుబడిదారులకు భరోసా కల్పించే విధానాలను కొనసాగిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత మూడు దశాబ్దాలుగా రాష్ట్రంలో అమలైన మంచి పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ మరింత మెరుగుపరుస్తున్నామని తెలిపారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా సుమారు 2.5 శాతం కాగా, జాతీయ స్థూల దేశీయోత్పత్తిలో రాష్ట్రం ఐదు శాతం వాటా కలిగి ఉందని, దీనిని పది శాతానికి పెంచడమే లక్ష్యమని వెల్లడించారు. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ఐపీఈఎంఏ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్, పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు, జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓబీసీ కులగణన ఉద్యమానికి వీరమణి మద్దతు

- *చెన్నైలో కృష్ణసామి వీరమణిని కలిసిన ప్రతినిధి బృందం*
- *నవంబర్ 28 ఢిల్లీ నిరసన కార్యక్రమానికి ఆహ్వానం*
- *ప్రతి ఓబీసీ కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించాలని డిమాండ్*
- *జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని సూచన*

చెన్నై, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):

దేశవ్యాప్తంగా ఓబీసీల సమగ్ర కులగణన చేపట్టాలనే డిమాండ్‌కు ద్రవిడర్ కజగం అధ్యక్షుడు, ప్రముఖ సామాజికవేత్త కృష్ణసామి వీరమణి మద్దతు తెలిపారు. చెన్నైలోని పెరియార్ గ్రౌండ్స్‌లో ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఎంపీ పి. విల్సన్, ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సూరజ్ యాదవ్ మండల్, అఖిల భారత ఓబీసీ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు కిరణ్ కుమార్ రజినీకాంత్ గౌడ్, జయంత్ యాదవ్ తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓబీసీ కులగణన ఆవశ్యకత, అందుకోసం చేపట్టిన ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. 2026 నవంబర్ 28న న్యూఢిల్లీలోని రామ్‌లీలా

మిగతా 2 లో..



అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా

- *గంగిపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రారంభం*
- *18 నుంచి 59 ఏళ్ల అర్హులకు బీమా రక్షణ*
- *గ్రామంలో 118 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు.. 85 నిర్మాణ దశలో*
- *విద్యుత్ ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగాల కల్పనకు కృషి*



మంచిర్యాల, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలో ఈ పథకం నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. రేషన్ కార్డు ఆధారంగా కుటుంబంలోని 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన సభ్యులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, ఆసరా పెన్షన్లు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత అల్పాహారం అందించే కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. ప్రజల జీవన

మిగతా 2 లో..

వ్యవసాయ రంగంలో భారీ పెట్టుబడులే లక్ష్యం

- *ప్రపంచ స్థాయి పెట్టుబడులకు తెలంగాణను గమ్యస్థానంగా తీర్చిదిద్దే యోచన*
- *డిసెంబర్ 7 నుంచి భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్*
- *ఎరువులు, ఆహార శుద్ధి, ఎఫ్ఎంసీజీ రంగాలపై ప్రత్యేక దృష్టి*
- *రైతు నుంచి వినియోగదారుడి వరకు సమగ్ర విలువ శృంఖల అభివృద్ధి*



హైదరాబాద్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణను ప్రపంచ స్థాయి వ్యవసాయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దడంతో పాటు వ్యవసాయం, ఎరువులు, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఎఫ్ఎంసీజీ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' నేపథ్యంలో తెలంగాణ సచివాలయంలో సంబంధిత రంగాల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పరిచయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించి పెట్టుబడుల అవకాశాలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. వ్యవసాయ ఇన్‌పుట్స్, ఎరువుల తయారీ సంస్థలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఎఫ్ఎంసీజీ కంపెనీలు, ఆహార ఉత్పత్తుల బ్రాండ్లు, పరిశోధనా సంస్థలు, అభివృద్ధి భాగస్వామ్య సంస్థల

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

డ్రగ్స్ రహిత భారత్ కోసం పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్ తయారీదారులు, సరఫరాదారులు, అక్రమ వ్యాపారంలో పాల్గొనే వారిని గుర్తించి చట్టం ముందు నిలబెట్టాలని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. మత్తు పదార్థాల అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై నిఘా పెంచడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాలను చేరవేసే నెట్‌వర్క్‌లను అడ్డుకోవడానికి ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.అదే సమయంలో మత్తు పదార్థాలకు బానిసైన యువత పట్ల సమాజం మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని కిషన్‌రెడ్డి సూచించారు. వ్యసనానికి లోనైన వారిని గుర్తించి, వారికి అవసరమైన వైద్య చికిత్స, మానసిక కౌన్సెలింగ్, పునరావాస సహాయం అందించాలని అన్నారు. సరైన సహకారం లభిస్తే వారు వ్యసనం నుంచి బయటపడి తిరిగి సాధారణ జీవితాన్ని ప్రారంభించగలరని పేర్కొన్నారు. యువతను నిందించడం కంటే వారిని వ్యసనం నుంచి బయటపడేలా ప్రోత్సహించడం, కుటుంబాలు వారికి అండగా నిలవడం ముఖ్యమని వివరించారు. మత్తు పదార్థాల వల్ల ఎదురయ్యే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.'నషా ముక్త్ భారత్' నిర్మాణం ఒక ప్రజా ఉద్యమంగా మారాలని, దేశ భవిష్యత్తును కాపాడుకోవడంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రముఖ సినీ నటుడు దగ్గుబాటి వెంకటేష్ కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సమకూర్పు పూర్తి చేస్తామని అధికారులు సమావేశంలో వివరించారు. ఇప్పటికే 14 స్టేడియాల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలిన ఆరు స్టేడియాల్లోనూ నెలాఖరులోగా పనులు ముగిస్తామని తెలిపారు.

తెలంగాణ సంప్రదాయ యుద్ధకళ కర్రసాముకు ఈ పోటీల్లో తొలిసారిగా ప్రదర్శన క్రీడగా అవకాశం కల్పిస్తున్నారు. జాతీయ స్థాయిలో ఈ కళకు గుర్తింపు తీసుకురావడంతో పాటు రాష్ట్రంలో దాని ప్రాచుర్యాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.కర్రసాముకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. మరోవైపు 27 క్రీడాంశాల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి చెందిన 1,334 మంది క్రీడాకారులకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. యూత్ గేమ్స్‌లో తెలంగాణ తరఫున పాల్గొనే 861 మంది క్రీడాకారులు, కోచ్‌లకు స్పోర్ట్స్‌కిట్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ క్రీడల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.203 కోట్లు ఖర్చు చేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21 కోట్లు కేటాయించింది. స్టేడియాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టడం, అత్యాధునిక క్రీడా పరికరాలు సమకూర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్లు వెచ్చిస్తోంది. భవిష్యత్తులోనూ క్రీడాకారులకు ఉపయోగపడేలా క్రీడా ప్రాంగణాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాట్లను వేగవంతం చేస్తోంది.

ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామానికి మోడల్ విలేజ్ హంగులు!

- **అక్కంపేట సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేయాలి**
- **గ్రంథాలయం, వాకింగ్ ట్రాక్, భూగర్భ డ్రైనేజీ, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు**
- **అధికారులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సూచనలు**



హనుమకొండ, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ స్వగ్రామమైన ఆత్మకూరు మండలంలోని అక్కంపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, అవసరమైన చర్యలు చేపట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులకు సూచించారు.రాష్ట్రప్రభుత్వం అక్కంపేటను ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిన నేపథ్యంలో గ్రామానికి ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించి, ఆహ్లాదకరమైన వాతావరణంతో అభివృద్ధి చేయాలని అన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష.. మౌలిక వసతులకు ప్రాధాన్యం:

బుధవారం హనుమకొండ జిల్లా కలెక్ట రేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అక్కంపేట గ్రామ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న సామాజిక, అభివృద్ధి పరిస్థితులను సమీక్షించి, చేపట్టాల్సిన పనులపై చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అక్కంపేటను ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం గ్రామ అభివృద్ధికి మంచి అవకాశమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామ రూపురేఖలు మార్చేలా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. విద్యార్థులు, యువతకు ఉపయోగపడేలా ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలోని రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, మెరుగైన విద్యుత్ సౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాఖలవారీగా సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.

నగర తరహా సౌకర్యాల కల్పనకు కృషి:

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఆదర్శ గ్రామంగా ఎంపికైన అక్కంపేటలో నగర తరహా సౌకర్యాలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అన్నారు. ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ఇతర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

త్వరగా అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి:

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ అక్కంపేట గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన అందజేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సామ్య నాయక్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ముఖ్య ప్రణాళిక అధికారి అజిత్ రెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్ భీమ్ రావు, మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ గాయత్రి, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, అక్కంపేట గ్రామ సర్పంచ్ సాంబయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓబీసీ కులగణన ఉద్యమానికి వీరమణి మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

మైదానంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వీరమణిని ప్రతినిధి బృందం ఆహ్వానించింది. 2027 జనగణనలో భాగంగా దేశవ్యాప్తంగా ఓబీసీల సమగ్ర కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించింది. ఓబీసీ వర్గాల్లోని ప్రతి కులాన్ని ప్రత్యేకంగా గుర్తించి లెక్కించాలని, జనగణనలో ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించాలని కోరుతున్నట్లు తెలిపింది.కులగణన ప్రక్రియలో ప్రత్యేక డ్రాప్‌డౌన్ జాబితాను రూపొందించడం ద్వారా ఏ కులానికి సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారో స్పష్టంగా గుర్తించే అవకాశం ఉంటుందని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఓబీసీలలోని అన్ని కులాల జనాభా వివరాలు కచ్చితంగా నమోదు కావాలంటే ప్రత్యేక గుర్తింపు విధానం అవసరమని పేర్కొన్నారు. ఈ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో నిరసన చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి కృష్ణసామి వీరమణి సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ప్రతినిధులు తెలిపారు. ఓబీసీ వర్గాల్లోని ప్రతి కులాన్ని జనగణనలో ప్రత్యేకంగా లెక్కించినప్పుడే ఆయా కులాల వాస్తవ జనాభా వివరాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడినట్లు వెల్లడించారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్ల అమలుకు సమగ్ర కులగణన ఆధారంగా ఉపయోగపడుతుందని వీరమణి పేర్కొన్నారు.ఓబీసీల సమగ్ర కులగణన అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చకు తీసుకెళ్లడమే లక్ష్యంగా నవంబర్ 28న ఢిల్లీలో నిరసన నిర్వహించనున్నట్లు ప్రతినిధి బృందం తెలిపింది. కులాలవారీ జనాభా వివరాలు అందుబాటులో ఉంటే విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన విధానాల రూపకల్పనలో స్పష్టత వస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గంగిపల్లి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వివేక్ వెంకటస్వామి తెలిపారు. గ్రామంలో 118 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటికే 85 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వెల్లడించారు.గ్రామ పాఠశాల అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించడంతో పాటు, గత ఏడాది, ప్రస్తుత ఏడాది కలిపి రూ.30 లక్షల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. విద్యా సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు. గ్రామానికి రవాణా సౌకర్యం మెరుగుపరిచేలా రూ.1.57 కోట్లతో నిర్మించిన గంగిపల్లి-ఎల్కంటి రహదారిని మంత్రి ప్రారంభించారు. శ్మశానవాటికకు వెళ్లే రహదారి నిర్మాణం కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంపైనా దృష్టి పెట్టినట్లు చెప్పారు. జైపూర్ విద్యుత్ ప్లాంట్‌లో గంగిపల్లి గ్రామస్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.భవిష్యత్తులో 1,250 మెగావాట్ల నూతన విద్యుత్ ప్లాంట్ ప్రారంభమైనప్పుడు భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు రహదారులు, విద్య, ఉపాధి రంగాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ గంగిపల్లి గ్రామ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

విద్యార్థుల అభ్యసన స్థాయిని మరింత మెరుగుపరచాలి!



- **ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకస్మిక తనిఖీలు**
- **విద్యార్థులతో మమేకమై పాఠ్యాంశాలపై ప్రశ్నలు.. ఉపాధ్యాయులకు పలు సూచనలు**

హనుమకొండ, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింత పెంపొందించి, నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధిస్తూ, వారి విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని అన్నారు.

బుధవారం దామెర మండలం వెంకటాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కలెక్టర్ సందర్శించి విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వారి అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనానికి ముందు అందిస్తున్న అల్పాహారం, పాలు పంపిణీ తదితర అంశాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

విద్యార్థులతో మమేకమై అభ్యసన సామర్థ్యాల పరిశీలన:

ఒకటి, రెండు, మూడు తరగతుల విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి నోట్‌బుక్‌లను పరిశీలించారు. విద్యార్థులు రాసిన పదాల అర్థాలను అడుగుతూ వారి చదవడం, రాయడం, అర్థం చేసుకునే సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు. నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. పదో తరగతి విద్యార్థులు భౌతిక శాస్త్రానికి సంబంధించిన అంశాలను బోర్డుపై రాసిన విధానం, ఇచ్చిన సమాధానాలను పరిశీలించి, ఇదే ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలని సూచించారు.

ఎనిమిదో తరగతి విద్యార్థులను ఖాన్ అకాడమీ ద్వారా అందిస్తున్న డిజిటల్ పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వాటిని ఎలా వినియోగిస్తున్నారో, ఎలా ప్రవేశం పొందుతున్నారో ఆరా తీశారు. పాఠశాలలో గ్రంథాలయ గది అందుబాటులో ఉందా అని అడిగి తెలుసుకోవడంతో పాటు పాఠశాల భవనాలను పరిశీలించారు.

విద్యాబోధనలో నాణ్యత పెంచాలి:

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని అంచనా వేస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా బోధించి, విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలకు సంబంధించి ఇంకా పూర్తికాని భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు అందించాలని పంచాయతీరాజ్ శాఖ సహాయ ఇంజినీర్‌ను ఆదేశించారు.

ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ రాజు, స్థానిక తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, మండల విద్యాశాఖ అధికారి జుమ్మా నాయక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో భారీ పెట్టుబడులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఉపయోగపడుతుందని తుమ్మల తెలిపారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడానికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని వివరించారు.తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక ప్రణాళికలో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని, తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పరిశ్రమల అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. వ్యవసాయం, ఎరువులు, వ్యవసాయ ఉత్పాదకాలు, ఆహార శుద్ధి, ఎఫ్ఎంసీజీ రంగాలను పరస్పరం అనుసంధానిస్తూ సమగ్ర విలువ శృంఖలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తుమ్మల వివరించారు. రైతు పంట పండించే దశ నుంచి ఉత్పత్తుల శుద్ధి, నిల్వ, ప్యాకేజింగ్, మార్కెటింగ్, వినియోగదారుడికి చేరే వరకు ప్రతి దశలోనూ అవకాశాలను మెరుగుపరచడమే ఈ విధానం ఉద్దేశమని తెలిపారు. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడంతో పాటు పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు లభ్యత, రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంధత్వ నివారణపై ప్రత్యేక దృష్టి.. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు!

- **హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంపై సమీక్ష**
- **2026–27 విద్యా సంవత్సరంలో 13.25 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షల లక్ష్యం**
- **అధికారులకు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డా. ఎం. సువర్ణ దిశానిర్దేశం**



హనుమకొండ, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్రంలో అంధత్వ నివారణ, దృష్టిలోపాల నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోపాల నియంత్రణ కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్, జాతీయ అంధత్వ నియంత్రణ అధికారి డా. ఎం. సువర్ణ హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షలు, కంటి శస్త్రచికిత్సలు, నేత్రదాన కార్యక్రమాల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ మహమ్మద్ ముష్రఫ్ అలీ ఫారూఖ్ ఆదేశాల మేరకు, ప్రజారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డా. బి. రవీంద్ర నాయక్ మార్గదర్శకత్వంలో ఈ పర్యటన చేపట్టారు.

పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షలపై పరిశీలన:

పర్యటనలో భాగంగా హనుమకొండ జిల్లాలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన డా. సువర్ణ విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల కార్యక్రమాన్ని పరిశీలించారు. దృష్టి లోపాలను గుర్తించడం, అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ, తదుపరి వైద్య సేవలు అందించే ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సుబేదారిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డా. టి. మదన్ మోహన్ రావుతో సమావేశమయ్యారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం లక్ష్యాలు, అమలు తీరు, సాధించాల్సిన ఫలితాలు, ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించారు.

వరంగల్‌లోనూ క్షేత్రస్థాయి తనిఖీలు:

వరంగల్ జిల్లాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలను సందర్శించి విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల కార్యక్రమాన్నిపరిశీలించారు.అలాగే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డా. రామ్ భార్గవ్‌తో అంధత్వ నివారణ కార్యక్రమం అమలుపై చర్చించారు. వరంగల్ ప్రాంతీయ కంటి ఆసుపత్రిని సందర్శించి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా. శ్రీకుమార్‌తో సమావేశమై కంటి వైద్య సేవల మెరుగుదలకు పలు సలహాలు, సూచనలు అందించారు. పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షల కార్యక్రమంలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తించారు.

13.25 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షల లక్ష్యం:

2026-27 విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మైనారిటీ, ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు, ఇతర విద్యాసంస్థల్లో సుమారు 13.25 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు పాఠశాలల వారీగా కంటి పరీక్షల వేగాన్ని పెంచాలని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ నేత్ర వైద్యాధికారులు, నేత్ర వైద్య నిపుణుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. దృష్టి లోపాలు గుర్తించిన విద్యార్థులకు సకాలంలో కళ్లద్దాలు అందించడంతో పాటు అవసరమైన వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో తదుపరి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

సమన్వయంతో లక్ష్యాలను సాధించాలి:

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కార్యక్రమాల అమలులో గుర్తించిన లోపాలను అధిగమించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని డా. సువర్ణ సూచించారు. కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. 1976లో ప్రారంభమైన జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం ద్వారా కంటి శస్త్రచికిత్సలు, విద్యార్థుల కంటి పరీక్షలు, ఉచిత కళ్లద్దాల పంపిణీ, నేత్రదానంపై అవగాహన వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో అంధత్వాన్ని, దృష్టి లోపాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.ప్రతి విద్యార్థికి స్పష్టమైన చూపు, ప్రతి అర్హుడికి నాణ్యమైన కంటి వైద్యం అందించడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ పర్యటన, సమీక్షా సమావేశాల్లో హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డా. మదన్ మోహన్ రావు, నేత్ర వైద్యాధికారి ప్రతాపగిరి ప్రసాద్, పరిపాల నాధికారి కోల రాజేష్, కార్యాలయ పర్యవేక్షకుడు కృష్ణ, హసన్‌పర్తి వైద్యాధికారి డా. రామ్ భార్గవ్, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా. కుమారస్వామి, డా. శ్రీనివాస్, డా. ఆదినారాయణ, డా. జ్యోతి, సబ్ యూనిట్ అధికారి విప్లవ్ కుమార్, ఆరోగ్య పర్యవేక్షకుడు లచ్చు, నర్సింగ్ అధికారులు, ఆరోగ్య సహాయకులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణా TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
గురువారం - 26 - నవంబర్ 2026
వరంగల్ 03

శీలం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ!



- **ఎనిమిది మంది నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక భరోసా**

ఎల్కతుర్తి నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎల్కతుర్తి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎల్కతుర్తి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్ మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. పేద ప్రజలకు వైద్యపరంగా ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ నాయకులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నాంపల్లి కవిత, చందుపట్ల రోహిత్ ప్రితం, సల్లాల జనార్దన్ రెడ్డి, ఐతే శివకుమార్, కడారి కొమురమ్మ, శనిగరం సుమతి, రాస రంజిత్, శనిగరం మమతలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, హుస్నాబాద్ శాసనసభ్యులు, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోడిశాల యాదగిరి గౌడ్, శనిగరం వెంకటేష్, డాక్టర్ రమేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, బక్కి, అంబాల జగన్, అర్జున్ గౌడ్, వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డయల్-100 / 112 సేవలను దుర్వినియోగం చేసిన వ్యక్తికి జైలు శిక్ష

- **మూడు రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించిన న్యాయస్థానం..**



కీసర,నవంబర్25 (తెలంగాణ ముచ్చట్లు):కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో డయల్ 100కు తప్పుడు సమాచారం అందించి పోలీసు సేవలను దుర్వినియోగం చేసిన వ్యక్తికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే, తేదీ: 24112026 న కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్ముల వెంకటేష్,తండ్రి రాములు,వయస్సు: 31 సంవత్సరాలు,వృత్తి: ఏసీ మెకానిక్, చెర్యాల నివాసి. అనే వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి, ఒకచోట హత్య జరుగుతోందని తప్పుడు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన పెట్రోలింగ్ వాహనం, బ్లూకోల్ట్స్ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సుమారు మూడు గంటలపాటు విచారణ చేపట్టారు. ఐనా.. అక్కడ ఎలాంటి హత్య సంఘటన జరగలేదని నిర్ధారించారు. అనంతరం చేపట్టిన విచారణలో సదరు వ్యక్తి మద్యం మత్తులో ఉద్దేశపూర్వకంగా డయల్ 100కు ఫోన్ చేసి తప్పుడు సమాచారం అందించినట్లు వెల్లడైంది. దీంతో కీసర పోలీసులు సదరు వ్యక్తిపై ఈపెట్టీ కేసు నమోదు చేసి, తేదీ 25112026 నాడు వి స్పెషల్ మార్నింగ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అనంతరం పోలీసుల మాట్లాడుతూ..

ప్రజల అత్యవసర సహాయం కోసం ఏర్పాటు చేసిన డయల్ 100 / 112 సేవలను ప్రజలు బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే పోలీసులకు సమాచారం అందించాలి. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం అందించి పోలీసు సమయాన్ని, వనరులను వృథా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేద ప్రజలకు సీఎం సహాయనిధి కొండంత అండ

- **జిల్లెల చిన్నారెడ్డి, మాజీమంత్రి**



వనపర్తి,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు): ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన మొత్తం రూ.49,70,900 విలువైన 173 చెక్కులు పోస్టాఫీసు ద్వారా నేరుగా లబ్ధిదారులకు చేరినట్లు ఆయన వెల్లడించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు.అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థికంగా ఎంతో భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. అత్యవసర వైద్య చికిత్సల సమయంలో ఈ నిధులు బాధిత కుటుంబాలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు.

బండి సంజయ్ మహా పాదయాత్రతో కాంగ్రెస్‌లో గుబులు

- **కరీంనగర్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? రూ.1,100 కోట్ల నిధులపై డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు సవాల్**



కరీంనగర్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్రకు ప్రజల నుంచి వచ్చిన స్పందనను చూసి కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు విమర్శించారు. కాషాయ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిన కరీంనగర్ వీధులను చూసి కాంగ్రెస్ నేతలకు భయం మొదలైందన్నారు. దేవుడి పేరు, హిందుత్వం గురించి బీజేపీ మాట్లాడితే కాంగ్రెస్‌కు ఎందుకు అభ్యంతరమని ప్రశ్నించారు. కుహనా లౌకికవాదం ముసుగులో ప్రజలను కాంగ్రెస్ మభ్యపెడుతోందని ఆరోపించారు.

ఏడున్నరేళ్లుగా బండి సంజయ్ ఏం చేశారని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధిని గుర్తించాలని అన్నారు. యూఐడీఎఫ్, యూసీఎఫ్ నిధుల కింద సుమారు రూ.1,100 కోట్లను కరీంనగర్‌కు తీసుకువచ్చారని తెలిపారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయిందని, త్వరలో జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సీఎస్ఆర్ నిధులతో సైకిళ్ల పంపిణీ, ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యాధునిక వైద్య పరికరాల అందజేత వంటి కార్యక్రమాలు బండి సంజయ్ చొరవతోనే జరిగాయని వివరించారు.

అర్హులైన వారి ఓట్లు తొలగిపోయాయని ఆరోపిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు కరీంనగర్ జిల్లాలో కనీసం పది మంది బాధితులను ఆధారాలతో తీసుకొచ్చి ఎమ్మార్వో, ఆర్డీవో లేదా కలెక్టర్ ముందు ప్రవేశపెట్టాలని సునీల్ రావు బహిరంగ సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండానే కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. దొంగ ఓట్లతో గెలిచే వారికే ఓట్ల పరిశీలన అంటే భయమని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇవ్వాల్సిన రూ.5 కోట్ల నియోజకవర్గ అభివృద్ధి నిధులను కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. కేంద్రం నుంచి ఉపాధి హామీ నిధులు రాకపోతే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగే పరిస్థితి లేదని, అప్పులు పుట్టకపోతే ప్రభుత్వం నడవని స్థితికి చేరుకుందని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ పనితీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రశంసించారని, అయినప్పటికీ కొందరు కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

అమృత్ పథకంతో పాటు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా పట్టణాలు, గ్రామాలకు నిధులు అందుతున్నాయని తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి ముందుకు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని ఆరోపించారు. ప్రసాద్ పథకం కింద కొండగట్టు, వేములవాడ, భద్రాచలం, ధర్మపురి దేవాలయాలను చేర్చేందుకు గతంలో ప్రతిపాదనలు పంపాలని కోరినా నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. బండి సంజయ్‌ను విమర్శించే ముందు కాంగ్రెస్ నాయకులు తమ ప్రభుత్వ పాలనను సమీక్షించుకోవాలని హితవు పలికారు.

ఈ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు వాసాల రమేష్, ఒంటెల సత్యనారాయణ, బండారి వేణు, బండ రమణారెడ్డి, సోమిడి వేణుప్రసాద్, వేముల చంద్రశేఖర్, దేశ వేదం, కాంపెల్లి రామన్, దేవసాని సత్యనారాయణ, పొన్నం లక్ష్మీ మొండయ్య గౌడ్, మేకల వెంకటేష్, భారీ జితేందర్, తేల్ల రమేష్, గొట్టే ముక్కల వెంకటరమణ, కోఆప్షన్ సభ్యులు సర్దార్ బల్వీర్ సింగ్, నందు, నాయకులు కటకం లోకేష్, అడిచెర్ల రాజు, టి.చంద్ర మౌళి, దాసరి రవి, సత్తి రెడ్డి, కుంభం అనిల్, ఖాజా, దాసరి రమేష్ పాల్గొన్నారు.

దీక్షా దివస్ సభకు భారీగా యువతను సమీకరిస్తాం

- **కేటీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతాం.సభను విజయవంతం చేస్తాం: జీకే యువత అధ్యక్షుడు మొగులోజు వెంకట్.**



కరీంనగర్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): ఈ నెల 29న కరీంనగర్ జిల్లా అలుగునూరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే సంకల్పంతో జీకే యువత ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. బుధవారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో జీకే యువత సభ్యులు సమావేశమై సభ నిర్వహణ, యువత సమీకరణపై చర్చించారు.

ఈ సందర్భంగా దీక్షా దివస్ సభకు కరీంనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున యువతను తరలించాలని నిర్ణయించారు. యువకులందరినీ సమీకరించి భారీ బైక్ ర్యాలీగా అలుగునూరుకు చేరుకొని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని తీర్మానించారు. సభను విజయవంతం చేసేందుకు జీకే యువత సభ్యులు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించుకున్నారు.

ఈ సందర్భంగా జీకే యువత అధ్యక్షుడు మొగులోజు వెంకట్ మాట్లాడుతూ.. రాను న్నది బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ ప్రజల ఆశీస్సులతో గంగుల కమలాకర్‌ను ఐదోసారి భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించుకొని, మళ్లీ మంత్రిగా చూడాలన్నదే తమ ఆకాంక్ష అని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గంగుల కమలాకర్ కరీంనగర్ నగర అభివృద్ధికి వందల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని కొనియాడారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. గంగుల కమలాకర్ మరోసారి మంత్రిగా బాధ్యతలు చేపడితే కరీంనగర్ అభివృద్ధి మరింత వేగంగా ముందుకు సాగుతుందని ఆకాంక్షించారు.

దీక్షా దివస్ అనేది తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని, ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జీకే యువత సభ్యులతో పాటు నగరంలోని అన్ని వర్గాల యువత, కరీంనగర్ నియోజకవర్గంలోని యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మొగులోజు వెంకట్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జీకే యువత సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రాధాన్యం

- **విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి.**



సత్తుపల్లి, నవంబరు 25 (తెలంగాణ ముచ్చట్లు): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని ప్రభుత్వం అందిస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన విద్యా సామగ్రి కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠశాల బ్యాగులు, బూట్లు, సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను అందజేశారు. పాఠశాల అవసరాల నిమిత్తం టేబుళ్లు, కుర్చీలను కూడా పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడంతోపాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో విద్యా సామగ్రిని సమకూరుస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహనా కమల్ పాషా, ఎంఈఓ రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి మహిళా సమాఖ్య చేయూత



పెద్దమందడి,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పునరావాస కేంద్రం (నైబర్‌హుడ్ సెంటర్)లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. యోగానంద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏపీఎం సక్రు నాయక్, మహిళా సమాఖ్య ప్రతినిధులు, సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి. భారతి, కార్యదర్శి ఎస్. నాగమ్మతో పాటు ఏపీఎం సక్రు నాయక్, ఏపీఎం సిబ్బంది పాల్గొన్నారు.అలాగే నైబర్‌హుడ్ సెంటర్ సీసీ, ఆర్ఎస్ఎస్ సీసీ, ఎంఎంఎస్ అకౌంటెంట్, ఈసీబీఆర్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమం, పునరావాసం, వారి అభ్యున్నతికి అందించాల్సిన సహాయ సహకారాలపై చర్చించారు.దివ్యాంగులకు అవసరమైన సేవలు అందిస్తూ, వారి అభివృద్ధికి మహిళా సమాఖ్య ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు.

దళిత హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి

- **రాజ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు**



పెద్దమందడి,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు): దళితుల హక్కుల సాధన, సామాజిక అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని వనపర్తి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. పెద్దమందడి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు గట్టు మన్నెం అధ్యక్షతన నిర్వహించిన దళిత చైతన్య సభ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ నెల 28న నాగర్‌కర్నూల్‌లో నిర్వహించనున్న దళిత చైతన్య సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సభ ఆవశ్యకతను గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా చూడాలని సూచించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. దళిత వర్గాల ఐక్యత, హక్కుల పరిరక్షణ, అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించే ఈ సభకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్ము వెంకటస్వామి మాట్లాడుతూ దళిత కుటుంబాల సంక్షేమం, అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీని కంటికి రెప్పలా కాపాడుకోవాలని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు గట్టు దయాకర్, సురేష్, చిన్నమందడి గ్రామ సర్పంచ్ స్వరూప, మండల ఉపాధ్యక్షులు దండు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శులు కొమ్ము సాయిబాబా, గట్టు రాజు, కార్యదర్శి అల్వాల రాజుతో పాటు బలిజపల్లి, జంగమయ్యపల్లి, మణిగిల్ల, చిన్నమందడి, పెద్దమందడి, దొడగుంటపల్లి తదితర గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత.. డ్రైవర్‌పై కేసు నమోదు



భీమదేవరపల్లి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): భీమదేవరపల్లి మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.భీమదేవరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కొప్పూరు వైపు నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి ఆపి తనిఖీ చేశారు.ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించగా, కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మొహమ్మద్ యాకూబ్ పాషా (31)గా గుర్తించారు.
పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో నింపుకొని ముల్కనూర్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ తెలిపాడు. ఇసుక తరలింపునకు సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేవని అంగీకరించడంతో ట్రాక్టర్‌తో పాటు డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వరల్డ్ మేయర్స్ సదస్సులో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం

- **ముంబై మేయర్‌తో కలిసి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఘన స్వాగతం.**
- **అంతర్జాతీయ వేదికపై కరీంనగర్‌కు గుర్తింపు**



కరీంనగర్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): ముంబై వేదికగా నిర్వహించిన వరల్డ్ మేయర్స్ సదస్సులో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు ప్రత్యేక గౌరవం లభించింది. సదస్సులో భాగంగా ముంబై మేయర్‌తో కలిసి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఘనంగా స్వాగతం పలికే అవకాశం ఆయనకు దక్కింది. దేశవిదేశాలకు చెందిన పలు ప్రముఖ నగరాల మేయర్లు, ప్రజాప్రతినిధులు హాజరైన ఈ అంతర్జాతీయ వేదికపై కొలగాని శ్రీనివాస్‌కు ఈ ప్రత్యేక గుర్తింపు లభించడం విశేషం. ఈ సదస్సులో పట్టణాభివృద్ధి, భవిష్యత్ నగరాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ ప్రాంతాల ఆధునీకరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన పట్టణాభివృద్ధి మంత్రులు సైతం పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. భవిష్యత్ నగరాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికపై తెలంగాణ రాష్ట్రం తరపున కరీంనగర్ నగరానికి ప్రాతినిధ్యం వహిస్తూ మహారాష్ట్ర ముఖ్యమంత్రికి స్వాగతం పలికే అవకాశం లభించడం పట్ల మేయర్ కొలగాని శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు.

కులవివక్ష లేని సమాజ నిర్మాణమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం



- **బుర్రి సతీష్ మాదిగ ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్,**

వనపర్తి,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు): కులవివక్ష లేని సమాజ నిర్మాణం, సామాజిక సమానత్వం సాధించడమే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి లక్ష్యమని ఆ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి బుర్రి సతీష్ మాదిగ అన్నారు. వనపర్తి పట్టణంలోని ఎంవైఎస్ మినీ ఫంక్షన్ హాల్‌లో మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు మొలకలపల్లి పరశురాముడు మాదిగ అధ్యక్షత వహించగా, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ సమన్వయం చేశారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న బుర్రి సతీష్ మాదిగ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి వ్యక్తిగతంగా ఎదగడంతో పాటు జాతి అభ్యున్నతికి బాధ్యతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేటికీ మాదిగలు, అణగారిన వర్గాలు కులవివక్ష, అంటరానితనం, సామాజిక, ఆర్థిక అసమానతలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులవ్యవస్థ నిర్మూలన, సమానత్వ సాధన కోసం పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ చేస్తున్న సామాజిక పోరాటాల్లో విద్యార్థులు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని కోరారు.అనంతరం బుర్రి సతీష్ మాదిగ వనపర్తి జిల్లా మాదిగ విద్యార్థి సమాఖ్య నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా పుట్టపాగ అజయ్ కుమార్ మాదిగ, అధికార ప్రతినిధిగా కేశపాగ భాస్కర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దయ్యపు రామ్ చరణ్ మాదిగ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మల్లికార్జున్, దయ్యపు కృష్ణ, కార్యదర్శులుగా గడ్డం మీది రవితేజ, బండారి విష్ణు, అభిలాష్ ఎంపికయ్యారు.జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా భారతరత్న మాదిగ, అధికార ప్రతినిధిగా శ్వేత మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కావ్య మాదిగ, ఉపాధ్యక్షురాలిగా ప్రేమకుమారి మాదిగ, కార్యదర్శిగా చైతన్య మాదిగ ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సహ ఇన్‌చార్జి మీసాల గణేష్ మాదిగ సమన్వయం చేశారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా ఇన్‌చార్జి మంద నరసింహ మాదిగ, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ అజ్జపాగ లక్ష్మణ్ మాదిగ, బుక్కాపురం మహేష్ మాదిగ, కమలాకర్ మాదిగ, గణేష్ మాదిగతో పాటు పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు అభినందనలు తెలిపారు.

కార్మికుల హక్కులకు గొడ్డలిపెట్టే నాలుగు కార్మిక కోడ్‌లు!

- **44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న కేంద్రం**
- **కార్మికుల హక్కుల సాధనకు సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలి: నల్ల స్వామి**



హన్మకొండ,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు): భవన నిర్మాణ రంగ కార్మికులు సహా దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు కార్మిక కోడ్‌లు బల హీనపరిచే ప్రమాదం ఉందని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కార్మికుల ప్రయోజనాలు, హక్కుల పరిరక్షణ కోసం అమల్లో ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించడం కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగించే పరిణామమని విమర్శించారు.
వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ పేరుతో తీసుకొచ్చిన ఈ నిబంధనల వెనుక కార్మికుల సంక్షేమం కంటే యాజమాన్యాల ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత లభించే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. కార్మిక సంఘాల స్వేచ్ఛ, సమిష్టి బేరసారాల హక్కు, నిరసనలు, సమ్మెలు వంటి కార్మిక పోరాటాలపై ఆంక్షలు పెరిగితే కార్మికులు తమ సమస్యలను యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లే అవకాశాలు కూడా పరిమితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.
ఒకే పనికి ఒకే వేతనం అందాలనే న్యాయమైన డిమాండ్‌కు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడటమే కాకుండా, కార్మిక సంఘాల మధ్య ఐక్యతను దెబ్బతీసి తమకు అనుకూలంగా తక్కువ వేతనాలకు పనిచేసే సంఘాలకు పనులు అప్పగించే పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల కార్మికుల మధ్య పోటీ, విభేదాలు పెరిగి యాజమాన్యాల ఆధిపత్యం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్మికుల సేవలను అవసరానికి అనుగుణంగా వినియోగించుకుని, వారి ఉద్యోగ భద్రతను ప్రశ్నార్థకం చేసే విధానాలు కార్మిక వర్గానికి ఆమోదయోగ్యం కావని స్పష్టం చేశారు.
భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రత్యేక పోరాటం అవసరం
నాలుగు కార్మిక కోడ్‌లపై జరుగుతున్న చర్చలతో పాటు భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా కార్మిక సంఘాలు విస్మరించకూడదని నల్ల స్వామి సూచించారు. ఈ కోడ్‌ల పరిధిలోకి వచ్చే పారిశ్రామిక కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, గిగ్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, హమాలీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితర వర్గాల హక్కుల పరిరక్షణకు సంఘాలు అండగా నిలవాలని కోరారు.
అదే సమయంలో భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డులో నకిలీ కార్మికుల నమోదును అరికట్టాలని, ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికుల నమోదుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులు ఎదుర్కొంటున్న ఉపాధి, భద్రత, సంక్షేమ సమస్యలపై ప్రత్యేక ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.
సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి
భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, వివిధ రకాల ఆర్థిక సహాయాలు, ఇతర ప్రయోజనాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి కార్మికుడికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నల్ల స్వామి డిమాండ్ చేశారు. కార్మికుల చెమట చుక్కలతో అభివృద్ధి చెందుతున్న వ్యవస్థలో వారి కుటుంబాల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.
కార్మికుల హక్కులను కాపాడుకోవడం, సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన ప్రయోజనాలను సాధించుకోవడం ఒక్క సంఘం వల్ల సాధ్యం కాదని, అన్ని కార్మిక సంఘాలు వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ విభేదాలకు అతీతంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకొస్తూ, అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించి హక్కులను సాధించుకోవాలని నల్ల స్వామి పిలుపునిచ్చారు.





ఘనంగా సీఎంఆర్ స్కూల్లో క్రీడా మహోత్సవ ప్రారంభం..

- **విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి.. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి**

కీసర, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు-):విద్యార్థుల్లో క్రీడ నైపుణ్యాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కుందన్ పల్లి లోని సీఎంఆర్ స్కూల్ లో నిర్వహిస్తున్న క్రీడా మహోత్సవం 2026 కార్యక్రమాన్ని మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. క్రీడా పోటీలు రెండు రోజులపాటు జరిగే ఈ క్రీడా మహోత్సవంలో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన సుమారు 31 పాఠశాలలు పాల్గొన్ననున్నాయన్నారు. 31 పాఠశాలల విద్యార్థుల భాగస్వామ్యంతో స్పోర్ట్స్ డే సందర్భంగా సీఎంఆర్ స్కూల్లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు పాటలకు నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం రెండు రోజులపాటు నిర్వహించే క్రీడా పోటీల్లో చుట్టుపక్కల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. 31 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ మహోత్సవంలో భాగస్వాములు కావడంతో వివిధ పాఠశాల విద్యార్థులకు క్రీడా వేదికగా ఏర్పాటైయింది. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నదే ముఖ్య ఉద్దేశం. అనంతరం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని అన్నారు. విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడల్లోనూ రాణించాలనేదే తన ఉద్దేశమని, తన పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ముందుకు తీసుకెళ్తూ, అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తామని మల్లారెడ్డి పేర్కొన్నారు. అలాగే విద్యార్థులతో కలిసి నృత్యం కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మల్లారెడ్డి నృత్యం చేసి అందరినీ ఆలరించారు. రెండు రోజులపాటు జరిగే క్రీడా మహోత్సవంలో పాల్గొనే పాఠశాల విద్యార్థులకు పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించామన్నారు.





అంతర్జాతీయ ఐరన్‌మ్యాన్ పోటీలో వనపర్తి బిడ్డ కృష్ణ సత్తా



వనపర్తి,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు)అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐరన్‌మ్యాన్ పోటీలో వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కార్వంగ కృష్ణ ప్రతిభ చాటి వనపర్తి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు.గోవాలో జరిగిన ఈ పోటీలో 33 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా, కృష్ణ ఒకే రోజులో 90 కిలోమీటర్ల సైక్లింగ్, 1.9 కిలోమీటర్ల సముద్ర ఈత, 21 కిలోమీటర్ల పరుగు పూర్తి చేసి రెండో స్థానం సాధించారని తెలిపారు.ఈ సందర్భంగా వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో పదవీ విరమణ పొందిన సైనిక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, మిత్రుల ఆధ్వర్యంలో కృష్ణకు ఘనంగా సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ కృష్ణ విజయం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పోచా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్మీలో దేశానికి సేవలందించి, క్రీడల్లోనూ ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. సబిరెడ్డి వెంకట్ రెడ్డి యువత క్రీడలు, వ్యాయామంపై దృష్టి సారించాలని సూచించారు.జిల్లా క్రీడా అధికారి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణ గ్రామానికి, మండలానికి, జిల్లాకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. అనంతరం కృష్ణను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి, కోచ్‌లు గఫార్ సింగ్, మహేష్, వెంకటరమణ, సునంద గౌడ్, ఆంజనేయులు గౌడ్, సాహితీ కళా వేదిక సభ్యులు, క్రీడాభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివ–శివలీల వివాహ వేడుకలో పాల్గొన్న నాయకులు



పెద్దమందడి,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన కర్ణనాగేంద్రమ్మ దంపతుల కుమారుడు శివ వివాహం శివలీలతో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు పలువురు నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శివ-శివలీల దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేసి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డిఎస్ మహేష్, శివ శంకర్, మల్లికార్జున్, నారాయణ, దయ్యాల శేఖర్, మద్దూర్ వెంకటయ్య, కానాపురం బుచ్చన్న, గుండెల ఆంజనేయులు, ఇరికి చెట్టు ఆంజనేయులు,అశోక్, బండి రాజు, గుండెల సుభాష్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
గురువారం - 26 - నవంబర్ 2026

హనుమాన్ విగ్రహానికి విరాళంగా రూ.21 వేలు అందించిన కౌకుట్ల రాహుల్ రెడ్డి



నాగారం, నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు):ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్లో నిరాంపల్లి హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహం ప్రతిష్టాపన కోసం హనుమాన్ విగ్రహానికి నాగారం డివిజన్ బిజెపి పార్టీ యువ నాయకుడు కౌకుట్ల రాహుల్ రెడ్డి రూ. 21,000/ విరాళంగా ఇచ్చారు. రాంపల్లి గ్రామంలోని శ్రీ హనుమాన్ విగ్రహానికి, దేవాలయ అభివృద్ధి పనుల నిమిత్తం ప్రముఖ నాయకులు /దాత కౌకుట్ల రాహుల్ రెడ్డి రూ. 21,000 (ఇరవై ఒక్క వేల రూపాయలు) నగదును విరాళంగా అందజేసినందుకు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు రాహుల్ రెడ్డిని శాలువాతో సత్కరించి, ఆలయ అభివృద్ధికి వారు అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. అనంతరం రాహుల్ రెడ్డి మాట్లాడుతూ.. హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం నా వంతుగా విరాళాన్ని అందించడం,దైవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీ కేఫ్‌ల వెనుక ధూమపాన అడ్డాలు.. యువత ఆరోగ్యంపై ఆందోళన!

- **టీ తాగేందుకు వచ్చి సిగరెట్ పొగలో మునిగిపోతున్న యువత**
- **క్యాబిన్ ముందు టీ విక్రయాలు.. వెనుక ప్రత్యేకంగా స్మోకింగ్ ఏర్పాట్లు!**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు – ముల్కనూర్ ఎస్సై రాజు**





భీమదేవరపల్లి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): మండల పరిధిలో రోడ్ల పక్కన రోజురోజుకూ కొత్తగా వెలుస్తున్న టీ కేఫ్‌లు యువతకు అడ్డాలుగా మారుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. కస్టమర్ల సౌకర్యం పేరుతో కొన్ని టీ కేఫ్‌ల నిర్వాహకులు ప్రధాన క్యాబిన్‌కు వెనుక భాగంలో ప్రత్యేకంగా స్మోకింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో టీ తాగేందుకు వచ్చే యువకులు, విద్యార్థులు సైతం సిగరెట్ ధూమపానానికి అలవాటు పడే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టీ కేఫ్‌ల వెనుక ధూమపాన సందడి

కొన్ని కేఫ్‌ల వెనుక భాగాల్లో యువకులు గుంపులుగా చేరి టీ తాగుతూ సిగరెట్లు కాలుస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీంతో టీ విక్రయ కేంద్రాలుగా ఉండాల్సిన కేఫ్‌లు ధూమపానానికి వేదికలుగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు, యువత ఇలాంటి వాతావరణానికి ఆకర్షితులైతే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. స్నేహితులతో సరదాగా ప్రారంభమయ్యే సిగరెట్ అలవాటు క్రమంగా వ్యసనంగా మారుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నిబంధనలకు లోబడే స్మోకింగ్ జోన్లు

పొగాకు నియంత్రణ చట్టం (COTPA) ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానంపై నిషేధం ఉంది. అయితే నిర్దిష్ట అర్హతలు, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ఉన్న కొన్ని ప్రదేశాల్లో మాత్రమే ప్రత్యేక స్మోకింగ్ ఏరియాలకు అనుమతి ఉంటుంది. ప్రతి టీ కేఫ్ వెనుక షెడ్డు లేదా ప్రత్యేక స్థలం ఏర్పాటు చేసినంత మాత్రాన అది చట్టబద్ధమైన స్మోకింగ్ జోన్‌గా పరిగణించబడదు. ఆయా కేఫ్‌లలో చట్ట నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్నది అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

అధికారులు తనిఖీలు చేపట్టాలి

టీ కేఫ్‌లలో ఏర్పాటు చేస్తున్న స్మోకింగ్ ప్రదేశాలకు చట్టబద్ధత ఉందా? మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్నారా? పొగాకు నియంత్రణ చట్ట నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. యువత ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కేఫ్‌ల నిర్వహణపై పర్యవేక్షణ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ఎస్సై రాజు

టీ కేఫ్‌లకు వచ్చే యువత వెనుక భాగాల్లో గుంపులుగా చేరి ధూమపానం చేస్తున్నట్లు మా దృష్టికి వస్తే తప్పకుండా పరిశీలిస్తామని ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపారు. ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానానికి సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న చట్ట నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టీ కేఫ్‌ల నిర్వాహకులు సైతం తమ వ్యాపార ప్రాంగణాల్లో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు అవకాశం కల్పించకూడదని సూచించారు. యువత భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై రాజు కోరారు.



దీక్షా దివస్ సభకు హుజూరాబాద్ నుంచి భారీగా తరలిరావాలి

- **నవంబర్ 29న కరీంనగర్‌లో జరిగే సభను విజయవంతం చేయాలి**
- **ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపు**

జమ్మికుంట, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): ఈ నెల 29న కరీంనగర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ సభను విజయవంతం చేసేందుకు హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. సభకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని స్వాతి గార్డెన్స్‌లో, వీణవంక మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సన్నాహక సమావేశాలు నిర్వహించారు. జమ్మికుంట పట్టణం, జమ్మికుంట మండలం, ఇల్లంతకుంట, వీణవంక మండలాలకు చెందిన పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే సమావేశమై సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు పాల్గొన్నారు.

మరోవైపు పార్టీ పిలుపు మేరకు జమ్మికుంట పట్టణం, వీణవంక మండలంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి దీక్షా దివస్ సభకు ఆహ్వానించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను వివరిస్తూ నవంబర్ 29న జరిగే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష రాష్ట్ర చరిత్రలో కీలక మైలురాయిగా నిలిచిందన్నారు. కేసీఆర్ పోరాట పటిమ, పట్టుదలతో తెలంగాణ ఉద్యమం కీలక మలుపు తిరిగి ప్రత్యేక రాష్ట్ర సాధనకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. తెలంగాణ కోసం జరిగిన పోరాటాన్ని, అమరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దీక్షా దివస్ అనేది కేవలం ఒక కార్యక్రమం కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. కరీంనగర్‌లో జరిగే సభకు హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష దేశ రాజకీయ చరిత్రలోనే ప్రత్యేక స్థానం సంపాదించుకుందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను దేశం దృష్టికి తీసుకెళ్లడంలో ఆ దీక్ష కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఉద్యమ చరిత్రను, ఉద్యమకారుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. నవంబర్ 29న కరీంనగర్‌లో జరిగే దీక్షా దివస్ సభకు పార్టీ శ్రేణులు, తెలంగాణ ఉద్యమ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ రావు మాట్లాడుతూ దీక్షా దివస్ ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ సభను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమాల్లో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్ వాలా బాలకిషన్ రావు, మాజీ జడ్పీటీసీ సాదవ రెడ్డి, మాజీ ఎంపీపీ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, సర్పంచులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్డుపైనే భవనాలు.. అధికారుల మౌనం వెనుక మాస్టర్ ప్లాన్.?..

- **చీర్యాల ద్వారక ఎన్‌క్లేవ్‌లో హెచ్ఎండీఏ రోడ్డుపైనే నిర్మాణాలు.. కీసరలో కలకలం!..**
- **అనుమతులు ఉన్నాయా ఉంటే ఏ ప్రాతిపదికన ఇచ్చారు.. అధికారులపై స్థానికుల ప్రశ్నలు!..**
- **ఫిర్యాదులు వచ్చినా స్పందన శూన్యం.. భారీ అవినీతికి మాస్టర్ ప్లాన్ లో భాగమేనా!..**
- **తక్షణ విచారణ జరపాలి.. అధికారులు వివరణ ఇవ్వాల్సిందే.. చర్యలు తీసుకోవాల్సిందే!..**





కీసర, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): కీసర సర్కిల్ పరిధిలో హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ అమలు చేయాల్సిన అధికారులే, భారీ అవినీతికి మాస్టర్ ప్లాన్ వేశారా? అన్న ప్రశ్న ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చీర్యాలలోని ద్వారక ఎన్‌క్లేవ్‌లో హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ రోడ్డుపై చేపడుతున్న భవన నిర్మాణాలే ఈ అనుమానాలకు కారణం. నిబంధనలు, నిర్మాణ అనుమతుల పై స్పష్టత లేకుండానే పనులు శరవేగంగా సాగుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ మాస్టర్ ప్లాన్ రోడ్డు విషయంలోనే నిబంధనల ఉల్లంఘన జరిగితే.. సంబంధిత అధికారులు ఏం చేస్తున్నట్టు? అని స్థానికులు నిలదీస్తున్నారు..

గతంలోనూ ఫిర్యాదులు.. అయినా స్పందన శూన్యం!..

ద్వారక ఎన్‌క్లేవ్‌లో అక్రమ నిర్మాణాలపై గతంలోనూ అనేక ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు సమర్థవంతంగా స్పందించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణ పనులు కళ్లెదుటే వేగంగా సాగుతున్నా తనిఖీలు ఎందుకు లేవన్నది స్థానికుల ప్రశ్న. ఈ మౌనమే అనుమానాలకు ఆజ్యం పోస్తోందని వారు అంటున్నారు..

టౌన్ ప్లానింగ్ అధికారులకు సూటి ప్రశ్నలు..సమాధానం చెప్పాల్సిందే..

- ఈ నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? ఉంటే వాటి వివరాలు ఏమిటి?..
- ప్రాతిపదికన అనుమతులు మంజూరు చేశారు?..
- మాస్టర్ ప్లాన్ రోడ్డు పరిధిలో నిర్మాణానికి ఎలా అవకాశం కల్పించారు?..
- హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ రోడ్డు హద్దులను క్షేత్రస్థాయిలో ఎప్పుడైనా పరిశీలించారా?..
- నిబంధనల ఉల్లంఘన జరిగితే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు?..
- ప్రభుత్వ రోడ్డు స్థలంలో నిర్మాణాలు సాగుతుంటే అధికారుల కళ్లకు కనిపించలేదా? లేక కావాలనే కళ్లు మూసుకున్నారా?..
- ఇదంతా భారీ అవినీతికి వేసిన మాస్టర్ ప్లాన్ లో భాగమేనా?..

తక్షణ విచారణకు డిమాండ్..

ఇప్పటికైనా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణ అనుమతులు, భూమి వివరాలు, మాస్టర్ ప్లాన్ రోడ్డు హద్దులను పరిశీలించాలని కోరుతున్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం నిర్మాణ పనులు నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అంటున్నారు. అలాగే ఈ వ్యవహారంపై అధికారులు అధికారికంగా స్పందించి ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలన్నది ప్రధాన డిమాండ్..

ఇప్పుడు ప్రధాన ప్రశ్న..

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే మౌనం వహిస్తే.. ప్రజలకు సమాధానం చెప్పేదెవరు? మాస్టర్ ప్లాన్‌కే పాతరేస్తే.. జవాబుదారీ ఎవరిది? టౌన్ ప్లానింగ్ అధికారులు వివరణ ఇవ్వాల్సిందే.. చర్యలు తీసుకోవాల్సిందే! మరిన్ని కథనాలతో మీ తెలంగాణ ముచ్చట్లు తెలుగు దినపత్రిక సంచికలో..

జమ్మికుంట, ఉప్పల్ రైల్వే స్టేషన్ల అభివృద్ధికి అడుగులు

- **కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రైల్వే సౌకర్యాల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ**

జమ్మికుంట, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తెలిపారు. జమ్మికుంట, ఉప్పల్ రైల్వే స్టేషన్ల అభివృద్ధితో పాటు కొండగట్టులో నూతన రైల్వే స్టేషన్ ఏర్పాటుకు అనుమతుల కోసం ఆయన కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.





అభివృద్ధికి కేంద్ర నిధులు తీసుకురావడంలో ఎంపీ చొరవ చూపుతున్నారని తెలిపారు. వరంగల్–జగిత్యాల జాతీయ రహదారి పనులతో పాటు రైల్వే రంగంలోనూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేస్తున్నారని వెల్లడించారు.

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్ నగరంతో పాటు వివిధ మండలాల జమ్మికుంట, ఉప్పల్ రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేయడంతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్లు, లిఫ్టుల ఏర్పాటు, మరిన్ని రైళ్ల నిలుపుదలకు చర్యలు చేపట్టే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ఈ ప్రాంతంలోని వ్యాపారులు, పారిశ్రామిక వర్గాలకు ప్రయోజనం చేకూరేలా సరుకుల ఎగుమతులు, దిగుమతుల కోసం ప్రత్యేక వ్యాగన్ రైలు సదుపాయం కల్పించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టుకు నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారని, వారి ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అక్కడ నూతన రైల్వే స్టేషన్ ఏర్పాటుకు అనుమతులు కోరడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే భక్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ఆకుల రాజేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రైల్వే కనెక్టివిటీని పెంచి, ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్న ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పీజేఆర్

జమ్మికుంట, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పొనగంటి రవికుమార్ (పీజేఆర్) నియమితులయ్యారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, జిల్లా నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు తనపై నమ్మకం ఉంచి జిల్లా స్థాయి బాధ్యత అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఓబీసీ మోర్చా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బీజేపీ ప్రతిష్టను మరింత పెంచేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పొనగంటి రవికుమార్ పేర్కొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు

- **హుజురాబాద్ పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై మంత్రి దృష్టికి తీసుకెళ్లిన చైర్‌పర్సన్**



హుజురాబాద్,నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్కను హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను ఆత్మీయంగా కలిసి పలు అంశాలపై చర్చించారు.
ఈ భేటీలో హుజురాబాద్ పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, మహిళలు, పిల్లల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలకు ప్రాధాన్యత నిస్తూ చర్చించినట్లు తెలిపారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం వంటి అంశాలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.
హుజురాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చైర్‌పర్సన్ సుహాసిని మనోజ్ రావు తెలిపారు. పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.
మహిళలు, పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. పట్టణ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ సహకారం అందించాలని మంత్రి సీతక్కను కోరినట్లు తెలిపారు.
మంత్రి సీతక్కతో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. ప్రజాప్రతినిధుల మధ్య జరిగిన ఈ సమావేశం హుజురాబాద్ పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు దోహదపడింది.

మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

- **కుటుంబ సమస్యల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి..**



ఖమ్మం బ్యూరో, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి స్టేషన్ పనితీరును, కేసుల దర్యాప్తు పురోగతిని, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై సిబ్బందితో సమీక్షించారు.
మహిళా పోలీస్ స్టేషన్‌కు సున్నితమైన కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మధ్య వివాదాలు, గృహ హింసకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో ప్రతి ఫిర్యాదును సానుకూల దృక్పథంతో, బాధ్యతాయుతంగా పరిశీలించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. కుటుంబ సమస్యల విషయంలో ఇరు పక్షాల వాదనలు ఓపికగా విని, చట్టపరిధిలో సాధ్యమైన మేరకు కౌన్సెలింగ్ ద్వారా సామరస్యపూర్వక పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అదే సమయంలో మహిళలపై వేధింపులు, గృహహింస, ఇతర నేరాలకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, బాధిత మహిళలకు భరోసా కల్పిస్తూ చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే మహిళలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా సిబ్బంది పనిచేయాలని పోలీస్ కమిషనర్ దిశానిర్దేశం చేశారు.

ప్రారంభమైన అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల వెరిఫికేషన్ ప్రక్రియ



ఖమ్మం బ్యూరో, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేకూర్చే దిశగా ప్రభుత్వం చేపట్టిన బాండ్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రంలో ప్రారంభమైంది. ఈ ప్రక్రియకు హాజరవుతున్న బాధితులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు. వెరిఫికేషన్ కోసం వచ్చే బాధితులకు క్రమబద్ధంగా సేవలు అందించేలా, రద్దీ లేకుండా అవసరమైన ప్రకారం హాజరై, ముందుగా క్రమపద్ధతిలో టోకెన్ తీసుకుని సంబంధిత బాండ్ పత్రాలు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించి వెరిఫికేషన్ ప్రక్రియను క్యూ లైన్ లో సజావుగా పూర్తి చేస్తున్నారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శామీనాలు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. సిసిఎస్ ఏసీపీ సర్వర్ ఆధ్వర్యంలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వెరిఫికేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నారు.
సిబ్బందిని అందుబాటులో ఉంచారు. బాధితులు తమకు కేటాయించిన తేదీల

ఎస్సై ప్రిలిమినరీ పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల సిబ్బందికి బయోమెట్రిక్ శిక్షణ

- **పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీ చర్యలు**
- **అడిషనల్ డీసీపీ రామానుజం**





ఖమ్మం బ్యూరో, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): ఎస్సై ప్రిలిమినరీ రాత పరీక్షల నిర్వహణలో ప్రిలిమినరీ పారదర్శకత, క్రమశిక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని అడిషనల్ డీసీపీ (నోడల్ ఆఫీసర్) రామానుజం అధికారులు సూచించారు.
తెలంగాణ పోలీస్ నియామక మండలి ఆధ్వర్యంలో నవంబర్ 29, ఆదివారం నిర్వహించనున్నా సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రిలిమినరీ రాత పరీక్షల నిర్వహణకు సంబంధించి 34 పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వర్తించే 95 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ సిబ్బందికి బయోమెట్రిక్ విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఉమేన్స్ డిగ్రీ కాలేజ్ లో నిర్వహించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల గుర్తింపు నిర్ధారణ, బయోమెట్రిక్ వివరాల నమోదు, వేలిముద్రల సేకరణ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. బయోమెట్రిక్ ప్రక్రియను నిబంధనల ప్రకారం ఎలాంటి సాంకేతిక లోపాలకు తావులేకుండా నిర్వహించే విధానాన్ని వివరించారు.
కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ బానోత్ రెడ్డి (ప్రిన్సిపాల్ ఉమేన్స్ కాలేజ్) , అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ సాంబరాజు, పోలీస్ బయోమెట్రిక్ ఆఫీసర్ లవన్ కుమార్ పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతే మా ప్రభుత్వ లక్ష్యం

- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **భద్రాచలం నుంచి చర్ల దాకా పూర్తి ఏజెన్సీ ప్రాంతంలో విస్తృత పర్యటన**
- **పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**





ఖమ్మం బ్యూరో, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా తమ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పేదల గడపగడపకూ చేరవేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం భద్రాచలం నియోజకవర్గం లోని పూర్తి ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డిసిసి అధ్యక్షురాలు దేవీ ప్రసన్న లతో కలిసి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా.. భద్రాచలంలోని రంగనాయకుల గుట్ట వద్ద గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో గిరిజన బహుళ ప్రయోజన మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత దుమ్ముగూడెం మండలం నారాయణరావుపేట గ్రామంలో ఆశ్రమ పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించారు. పర్ణశాల ఘాట్ వద్ద ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చర్ల మండలంలోని కుదునూరు, దేవరపల్లి గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం... చర్లలోని గిరిజన బాలికల వసతి గృహానికి నూతన డార్మెటరీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యమిస్తూ అనేక ఆధునిక మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. అలాగే అభివృద్ధి, సంక్షేమం జోడెద్దులుగా.. రెండు కళ్ళుగా భావించి.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, పంటల సాగుకు రైతు భరోసా, అర్హులైన పేదలందరికీ రాష్ట్రంలో 8లక్షల ఇందిరమ్మ ఇళ్లు, ఇప్పుడు చేయూత పింఛన్లను 4.30 లక్షల మందికి అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో కత్తుల ప్రదర్శన.. వ్యక్తిపై కేసు నమోదు

- **ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తి వద్ద నుంచి మారణాయుధాలు స్వాధీనం**



ఖమ్మం బ్యూరో , నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): సామాజిక మాధ్యమాల్లో కత్తులు ప్రదర్శిస్తూ, దౌర్జన్యాలను ప్రోత్సహించే విధంగా చిత్రాలను, దృశ్యాలను ప్రచురిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తిపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపాలెం మండలం దోసబండ గ్రామంలో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్ తండ్రి సయ్యద్ అనే వ్యక్తి తన సామాజిక మాధ్యమ ఖాతాలో కత్తులు ప్రదర్శిస్తూ దృశ్యాలను ప్రచురిస్తున్నట్లు పోలీసుల నిఘాలో గుర్తించారు. అంతేకాకుండా 'ఠాగూర్ సెటిల్‌మెంట్లు' పేరుతో ముఠా కార్యకలాపాలతో సంబంధం ఉన్నట్లు, తాను రౌడీ అన్నట్లుగా చిత్రీకరించుకుంటూ ప్రజల్లో భయాందోళనలు కలిగించే విధంగా దృశ్యాలను ప్రచురిస్తున్నట్లు గుర్తించారు.దీంతో అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు, అతని వద్ద ఉన్న మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి గత నేర చరిత్రపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్లు రఘునాథపాలెం పోలీసులు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో మారణాయుధాలను ప్రదర్శించడం, దౌర్జన్యాలను ప్రోత్సహించే విధంగా ప్రచురణలు చేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ముక్కోటి ఏకాదశి నాటికి "భద్రాద్రి"ని సిద్ధం చేస్తాం



- **భవిష్యత్ తరాలకు ఆదర్శంగా దేవస్థాన అభివృద్ధి పనులు**
- **మరో 200 ఏళ్ళు నిలిచేలా రూ.300 కోట్లతో శాశ్వత నిర్మాణాలు**
- **కేబినెట్ సబ్ కమిటీ ద్వారా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ**
- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): గోదావరి పుష్కర మహోత్సవాల్లో భాగంగా.. బాసర నుంచి భద్రాద్రి వరకు టెంపుల్ కారిడార్ లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను డిసెంబర్ 19న నిర్వహించే ముక్కోటి ఏకాదశి నాటికి.. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రధాన నిర్మాణాలను పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులను మంత్రి పొంగులేటి పరిశీలించారు. దమ్మక్క అన్నదాన సత్రం నుంచి మెట్ల దారి వరకు.. ప్రధాన ఆలయం చుట్టూ చేపట్టిన కాంక్రీట్ నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ..రూ. 1,100 కోట్లతో గోదావరి పుష్కరాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం పద్ద రూ. 300 కోట్లతో దేవస్థానం చుట్టూ అభివృద్ధి పనులు చేస్తున్నామని, ప్రస్తుతం స్లాబ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. పుష్కరాలప్పుడు ప్రధాన పుణ్యక్షేత్రంగా భద్రాచలం నిలుస్తుందని.. కోటి మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.
భావితరాలు మెచ్చేలా పనులు
భద్రాచలం వద్ద చేస్తున్న అభివృద్ధి పనులు 200 ఏళ్ళ పాటు.. భావితరాలు మెచ్చేలా ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో.. కేబినెట్ సబ్ కమిటీ ద్వారా 15 రోజులకోసారి పనులను సమీక్షిస్తున్నట్లు, తాను ఇప్పటికే నాలుగైదు సార్లు వ్యక్తిగతంగా పరిశీలించినట్లు వివరించారు.
ఈ కార్యక్రమంలో..: కలెక్టర్ దివాకర. టీఎస్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటిడిఏ పిఓ రాహుల్, సబ్ కలెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీపీల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- **బాచుపల్లిలో ముగ్గురు కార్మికుల మృతిపై హైడ్రా కమిషనర్ పరిశీలన**
- **నిబంధనలు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరిక**

హైదరాబాద్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): నగరంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీ) నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ఎస్‌టీపీలను నిర్మించడంతో పాటు వాటి నిర్వహణ కూడా పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేటు సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించామని గేటెడ్ కమ్యూనిటీలు తమ బాధ్యత ముగిసినట్లు భావించరాదని సూచించారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్, ఏపీఆర్ ఎన్‌క్లేవ్‌లో మంగళవారం ఎస్‌టీపీ ట్యాంకును శుభ్రం చేస్తూ విషవాయువులు పీల్చి ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటనాస్థలాన్ని బుధవారం రంగనాథ్ పరిశీలించారు. హైడ్రా, సీఎంసీ అధికారులను ప్రమాదానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకరి తర్వాత ఒకరు ట్యాంకులోకి దిగి ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.
ఎస్‌టీపీల నిర్వహణకు బాధ్యతలు తీసుకున్న ప్రైవేటు ఏజెన్సీలు కూడా తగిన భద్రతా పరిస్థితులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని కమిషనర్ సూచించారు. మురుగునీరు ఎంతమేర శుద్ధి అవుతోంది, శుద్ధి చేసిన నీరు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉందా అనే అంశాలను నిరంతరం తనిఖీ చేయాలని చెప్పారు. నిర్వహణలో లోపాలు కనిపిస్తే సంబంధిత ఏజెన్సీలతో పాటు బాధ్యులపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్‌టీపీ ట్యాంకుల్లో విషవాయువులు పేరుకుపోకుండా సరైన వెంటిలేషన్, గ్యాస్ బయటకు వెళ్లే ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని రంగనాథ్ పేర్కొన్నారు. సులభంగా శుభ్రం చేసేందుకు అనువైన రీతిలో ట్యాంకులను నిర్మించాలన్నారు. శుభ్రపరిచే పనులకు శిక్షణ పొందిన కార్మికులనే నియమించాలని, వారు తగిన శ్వాస రక్షణ పరికరాలు, ఇతర భద్రతా సామగ్రిని వినియోగించేలా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. విషవాయువులు ఉన్న ట్యాంకులో ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండా దిగడం ప్రాణాంతకమని హెచ్చరించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
గురువారం - 26 - నవంబర్ 2026

శుభకార్యాలకు హాజరు.. నూతన జంటలకు ఆశీర్వచనాలు





- **ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విస్తృతంగా పర్యటించిన పొంగులేటి**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన జంటలు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పిల్లాపాపలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఖమ్మంలోని కావేరి రిసార్ట్స్‌లో దగ్గుపాటి శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం లక్ష్మీ చంద్ర గార్డెన్స్‌లో ఖమ్మం కొత్తగూడెం 15వ డివిజన్‌కు చెందిన మొర్రి మేకల అమరయ్య కుమారుడి వివాహానికి, సూర్యదేవర ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం రూరల్ మండలం కామంచికల్ గ్రామానికి చెందిన అనంతుల లక్ష్మీనారాయణ కుమార్తె వివాహానికి, టేకులపల్లి లోని రాజరాజేశ్వరి కన్వెన్షన్ సెంటర్లో మాణిక్య నగర్ కు చెందిన కొండూరు గోవిందరావు కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు.అలాగే ఖానాపురంలోని కొలిపాక ఫంక్షన్ హాల్‌లో కొండబోయిన పిచ్చయ్య కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్నారు. కారేపల్లిలో గుగులోతు రవి నాయక్ కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను మనస్ఫూర్తిగా దీవించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా..: టేకులపల్లి వద్ద బొమ్మనపల్లి ధర్మయ్య కూతురి వివాహ వేడుకకు, కొత్తగూడెంలోని ఎస్ కే టి అపార్ట్మెంట్స్ హనుమాన్ బస్తీలో కాకొల్లు నాగేశ్వరరావు కుమార్తె వివాహ వేడుకకు హాజరై దీవించారు.ఈ కార్యక్రమాల్లో..: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
- **చర్లలో అండర్ -17 రాష్ట్రస్థాయి బాలుర టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం**



ఖమ్మం బ్యూరో, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ ప్రోత్సాహానికి ప్రాధాన్యం ఇస్తోందని, మన తెలంగాణ క్రీడాకారులు భవిష్యత్తులో ప్రపంచ క్రీడాకారులతో పోటీపడి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.చర్లలోని పోలీసు గ్రౌండ్ లో బుధవారం రాత్రి అండర్ 17 రాష్ట్రస్థాయి బాలుర టోర్నలో ప్రథమ స్థానంలో నిలిచిన ఖమ్మం జిల్లా జట్టుకు, అలాగే ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు, ఉత్తమ క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటిడి ఏ పీఓ రాహుల్, డిసిసి అధ్యక్షురాలు దేవీ ప్రసన్నలతో కలిసి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతమైన చర్లలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందని.. అంతర్జాతీయ స్థాయిలో మన తెలంగాణ మెరిసేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పంట రుణాల చెల్లింపునకు వెసులుబాటు కల్పించాలి

- **36 నెలల పాటు రుణాల లీషెడ్యూల్.. 12 నెలల మారటోరియం**
- **బ్యాంకులు క్షేత్రస్థాయిలో నిర్ణయాన్ని అమలు చేయాలి**
- **కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హనుమకొండ, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్నరైతులకు పంట రుణాల చెల్లింపులో కల్పించిన వెసులుబాటు నిర్ణయాన్ని బ్యాంకులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. రైతులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా రుణాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రైతులు తీసుకున్న పంట రుణాల చెల్లింపులపై బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నిబంధనలకు అనుగుణంగా రుణాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న మండలాల్లోని అన్ని బ్యాంకులు ఈ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు.నిబంధనల ప్రకారం పంట రుణాలను 36 నెలల కాలపరిమితికి పునర్వ్యవస్థీకరించడంతో పాటు, మొదటి 12 నెలల పాటు రుణాల చెల్లింపులకు విరామం కల్పించే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఈ నిర్ణయం అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో అందేలా బ్యాంకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకానికి సంబంధించి ఇప్పటికే మంజూరైన రుణాలను కూడా ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనల మేరకు పునర్వ్యవస్థీకరించనున్నట్లు బ్యాంకర్లు సమావేశంలో వివరించారు.ఈ సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ సహాయ మహాప్రబంధకుడు చేతన్ గోరేఖర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, లీడ్ జిల్లా మేనేజర్ విష్ణుప్రియ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

- **హనుమకొండ జిల్లాలో 63,107 మంది ఓటర్ల నమోదు**
- **డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, మార్పులకు అవకాశం**



హనుమకొండ, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాను బుధవారం ప్రచురించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కానివారు, తప్పులు ఉన్నవారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
ఎన్నికలకు సంబంధించిన అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం నిర్వహించే సమావేశంలో భాగంగా బుధవారం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ ఎన్.రవి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలను వెల్లడించారు.
హనుమకొండ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో మొత్తం 63,107 మంది ఓటర్లుగా నమోదైనట్లు అదనపు కలెక్టర్ రవి తెలిపారు. బుధవారం నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై కొత్తగా పేర్ల నమోదు, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, సవరణలకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఓటర్ల జాబితాను పరిశీలించుకుని, ఏవైనా అభ్యంతరాలు లేదా తప్పులు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.
అనంతరం ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రతులను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ అందజేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.
ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారులు వెంకటేష్, డి.ఎస్. వెంకన్న, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు జగత్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాస్ రావు, ప్రభాకర్ రెడ్డి, జోరిక రమేష్, నిశాంత్ ఎలుక, సయ్యద్ ఫైజుల్లా, అంబాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని కలిసిన ట్రైనీ డీఎస్పీలు

- **మర్యాదపూర్వకంగా భేటీ అయిన ఐదుగురు నూతన పోలీసు అధికారులు**



హనుమకొండ, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): 2025 గ్రూప్1 నియామక ప్రక్రియలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)లుగా ఎంపికైన ఐదుగురు అధికారులు శిక్షణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఇటీవల విధుల్లో చేరారు. ఈ క్రమంలో బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీలు శాంతన్ కుమార్ రెడ్డి, సాయి ప్రత్యూష్ రెడ్డి, సబిత, అంజనేయులు, యశస్విని కలెక్టర్‌ను కలిసి పరిచయం చేసుకున్నారు. శిక్షణలో భాగంగా జిల్లాలో విధులు నిర్వహించేందుకు వచ్చిన నూతన పోలీసు అధికారుల భేటీ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడారు.

‘ధైర్యంగా ఉండమ్మా.. అండగా ఉంటాం’



- **కేటీపీఎస్ ఏఓ కుటుంబానికి మంత్రి పొంగులేటి పరామర్శ**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) ఏఓ ఎన్. లెనిన్ కృష్ణప్రసాద్ ఇటీవల హఠాన్మరణం చెందడంతో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పాల్వంచలోని మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన చిత్రపటం వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం మృతుడి భార్యతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ‘ధైర్యంగా ఉండమ్మా.. పిల్లలను బాగా చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి’ అంటూ ఆమెకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా మృతుడి భార్య సోదరుడు, ఖమ్మం నగరానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దొడ్డా నగేష్‌తోనూ మాట్లాడి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసేకరణ, భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి!

- **అధికారులకు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశాలు**



హనుమకొండ, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయడంతో పాటు గ్రామాల్లో కొనసాగుతున్న భూముల పునఃసర్వేను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా, భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నిస్తూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
పెండింగ్ భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలి:
బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణ పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా భూసేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే ప్రాజెక్టులు, వివిధ ప్రభుత్వ శాఖలకు అవసరమైన భూముల కేటాయింపులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ కలెక్టర్ సమీక్షించారు. గ్రామాల్లో భూ పునఃసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, సంబంధిత మండలాల తహసీల్దార్లు సర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ సర్వేయర్లు, లైసెన్సు పొందిన సర్వేయర్లు ప్రతిరోజూ 40 ఎకరాలకు పైగా భూములను సర్వే చేయాలని సూచించారు. సర్వే పూర్తయిన భూముల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాల్లో స్పష్టత తీసుకురావడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశాల్లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ భూసేకరణ విభాగం ప్రత్యేక ఉప కలెక్టర్ రాధాభాయి, భూముల కొలతల శాఖ సహాయ సంచాలకుడు నూర్ సింగ్, హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారులు వెంకటేష్, డి.ఎస్. వెంకన్న, భూసేకరణ విభాగం పర్యవేక్షకుడు జగత్ సింగ్, తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, లైసెన్సు పొందిన సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి మంత్రి పొంగులేటి భరోసా



- **ఎంబీబీఎస్ పూర్తి చేసే వరకు ఏటా ఆర్థిక సాయం చేస్తానని అభయం**
- **తొలివిడతగా రూ.50 వేలు అందజేసి అండగా నిలిచిన శీనన్న**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు): పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థినికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అండగా నిలిచారు. ఎంబీబీఎస్ చదువు పూర్తయ్యే వరకు ఏటా ఆర్థిక సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు.
నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం గ్రామానికి చెందిన బచ్చలకూరి రామారావు కుమార్తె రిషిత సంగారెడ్డిలోని రాజరాజేశ్వరి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. కళాశాల ఫీజుల చెల్లింపునకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో బుధవారం మంత్రి పొంగులేటిని కలిసి తన పరిస్థితిని వివరించి సాయం కోరింది. విద్యార్థిని అభ్యర్థనపై మంత్రి వెంటనే స్పందించి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు.అంతేకాకుండా వైద్య విద్య పూర్తయ్యే వరకు ప్రతి ఏటా అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థినికి సూచించారు. మంత్రి చూపిన చొరవకు రిషిత కృతజ్ఞతలు తెలిపింది.
ఈ కార్యక్రమంలో..: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, సర్పంచ్ కొత్తపల్లి త్రివేణి వెంకటేశ్వర్లు, నాయకులు కొత్తపల్లి సుబ్బారావు, సత్యాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

అక్షరాల్లో ఆవేదన.. ఆలోచనల్లో తిరుగుబాటు!

సామాజిక స్పృహ,హేతుబద్ధ ఆలోచనలతో సాగుతున్న దియా విఘ్నేష్ సాహిత్య ప్రయాణం!

సామాజిక స్పృహను సాహిత్య ఆయుధంగా మలుస్తున్న రచయిత్రి దియా విఘ్నేష్

మహిళల అస్తిత్వం నుంచి సామాజిక అసమానతల వరకు.. వివక్షపై ప్రశ్నించే కలం.. ఐదు పుస్తకాలతో ప్రత్యేక గుర్తింపు.. అనువాద సాహిత్యంతో ప్రపంచ మహిళల గొంతుకకు తెలుగు వేదిక.. రచయిత్రిగా కొనసాగుతూనే న్యాయవాదిగా ప్రజల పక్షాన నిలవాలన్న ఆకాంక్ష..

- ప్రత్యేక కథనం | తెలంగాణ ముచ్చట్లు



సాహిత్యం అంటే కేవలం మనసులోని భావాలను అక్షరాలుగా మలచడం మాత్రమే కాదు.. సమాజంలోని వైరుధ్యాలను వెలుగులోకి తీసుకురావడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, అణచివేతకు గురైన గొంతుకలకు అక్షరరూపం ఇవ్వడం కూడా. అలాంటి సామాజిక బాధ్యతను తన రచనలకు పునాదిగా చేసుకొని సాహిత్య ప్రయాణాన్ని కొనసాగిస్తున్న రచయిత్రి దియా విఘ్నేష్. కవిత్వం, అనువాద సాహిత్యం, జీవిత చరిత్ర రచన.. ఇలా విభిన్న ప్రక్రియల్లో తనదైన ముద్ర వేస్తూ, సమాజాన్ని ప్రశ్నించే అక్షరాలతో పాఠకులకు చేరువవుతున్నారు.

మహారాష్ట్రలోని ముంబై సమీప భివండిలో పుట్టి పెరిగిన దియా విఘ్నేష్ మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చారు. ఎం.ఏ. ఆంగ్ల సాహిత్యం, బి.ఎడ్., న్యాయ శాస్త్ర పట్టా పూర్తి చేసి ప్రస్తుతం జూనియర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. అయితే ఆమెను ఒక అధ్యాపకురాలిగా మాత్రమే పరిచయం చేయడం అసంపూర్ణమే అవుతుంది. సామాజిక స్పృహ, హేతుబద్ధమైన ఆలోచనా విధానం, స్త్రీల అస్తిత్వం పట్ల నిబద్ధత, ప్రగతిశీల భావజాలం ఆమె సాహిత్య వ్యక్తిత్వానికి ప్రత్యేక గుర్తింపునిస్తున్నాయి.

తండ్రి ఆలోచనలే తొలి పాఠాలు.. ప్రశ్నించడమే తొలి అడుగు!

దియా విఘ్నేష్ సాహిత్య ప్రయాణానికి పునాది వేసింది ఆమె తండ్రి నుంచి అందిన పుస్తక పఠన అలవాటు, ప్రగతిశీల ఆలోచనా విధానం. వామపక్ష భావజాలం, నాస్తికత్వం, హేతువాద దృక్పథం కలిగిన తండ్రి చిన్నతనం నుంచే ప్రతి విషయాన్నీ ప్రశ్నించడం, ఆధారాలతో ఆలోచించడం, మూఢనమ్మకాలకు దూరంగా ఉండటం నేర్పించారు.

మరోవైపు సంప్రదాయ, భూస్వామ్య భావజాల ప్రభావం ఉన్న కుటుంబ వాతావరణంలో ఆడపిల్లగా ఎదుర్కొన్న వివక్ష ఆమెను మరింత ఆలోచింపజేసింది. ఒకవైపు సమానత్వం గురించి నేర్పిన తండ్రి ఆలోచనలు.. మరోవైపు ఇంటా బయటా మహిళలు ఎదుర్కొంటున్న అసమానతలు.. ఈ రెండు విభిన్న అనుభవాల మధ్య పెరిగిన ఆమెకు స్త్రీల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, అస్తిత్వం పట్ల చిన్ననాటి నుంచే ప్రత్యేకమైన అవగాహన ఏర్పడింది. ఆ ప్రశ్నలే క్రమంగా ఆమె రచనల్లో ప్రధాన ఇతివృత్తాలుగా మారాయి.

దేశభక్తి కవిత నుంచి సామాజిక ప్రశ్నల వరకు!

ఎనిమిదో తరగతి చదువుతున్న సమయంలోనే ఆమె తొలి కవిత రాశారు. దేశ గొప్పతనాన్ని కీర్తిస్తూ రాసిన ఆ కవితను తెలుగు ఉపాధ్యాయురాలు ప్రశంసించడంతో ఎంతో ఆనందంగా తండ్రికి చూపించారు. అయితే తండ్రి ఆ కవితను మెచ్చుకుంటూనే అందులోని అంశాలు వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉన్నాయని చెప్పడం ఆమె ఆలోచనా ప్రపంచంలో కీలకమైన మలుపుగా మారింది.

దేశం గొప్పదని చెప్పుకోవడమే కాదు.. ప్రజల ఆకలి, పేదరికం, అవినీతి, మహిళలపై అణచివేత, వరకట్న వేధింపులు, సామాజిక అసమానతలు వంటి సమస్యలను కూడా చూడాలని తండ్రి చేసిన సూచన ఆమెకు కొత్త దృక్పథాన్ని పరిచయం చేసింది. దేశాన్ని ప్రేమించడం అంటే దాని లోపాలను కప్పిపుచ్చడం కాదు.. వాటిని గుర్తించి ప్రశ్నించడం కూడా అనే ఆలోచన ఆమెలో బలపడింది.

అలా ఒక సాధారణ దేశభక్తి కవితతో మొదలైన ప్రయాణం క్రమంగా సామాజిక స్పృహ కలిగిన సాహిత్య ప్రస్థానంగా రూపుదిద్దుకుంది. ఆమె తొలి కవితలను తండ్రి ఎంతో జాగ్రత్తగా భద్రపరచడం విశేషం. ప్రముఖ రచయిత, కార్మిక పక్ష పాతి మచ్చ ప్రభాకర్ సహకారంతో అవి 'అరుణోదయం' పేరుతో పుస్తకరూపం దాల్చాయి. ఆ పుస్తకానికి మచ్చ ప్రభాకర్ నామకరణం చేయడమే కాకుండా ముందుమాట కూడా రాశారు.

సామాజిక మాధ్యమాల నుంచి సాహిత్య ప్రపంచం వరకు!

కొంతకాలం రచనలకు దూరంగా ఉన్న దియా విఘ్నేష్ 2016-17 ప్రాంతంలో సామాజిక మాధ్యమాల ద్వారా తిరిగి తన రచనా ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రగతిశీల, వామపక్ష భావజాలం కలిగిన మిత్రుల రచనలు, చర్చలు ఆమెను ఎంతగానో ప్రభావితం చేశాయి. వారి ప్రోత్సాహం, రచనల్లోని లోపాలను సరిదిద్దిన మార్గదర్శకత్వం ఆమెను రచయిత్రిగా మరింత పరిణతి చెందేలా చేసింది.

మహారాష్ట్రలో పుట్టి పెరగడం వల్ల తొలి నాళ్లలో తెలుగులో రాయడం ఆమెకు అంత సులభం కాలేదు. హిందీ, ఆంగ్ల భాషల్లో రచనలు చేసిన ఆమె క్రమంగా తెలుగు భాషపై పట్టు సాధిస్తూ, నిరంతర సాధనతో తన రచనా శైలిని మెరుగుపరుచుకున్నారు. భాషాపరమైన పరిమితులను అధిగమించి తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవడం ఆమె పట్టుదలకు నిదర్శనం.

ఐదు పుస్తకాలు.. ఐదు విభిన్న సాహిత్య కోణాలు!

ఇప్పటివరకు ఐదు పుస్తకాలతో తన సాహిత్య ప్రస్థానాన్ని విస్తరించిన దియా విఘ్నేష్ రచనల్లో కవిత్వం, అనువాదం, జీవితానుభవాల కథనం ప్రధానంగా కనిపిస్తాయి.

'అరుణోదయం' ఆమె తొలి పుస్తకం. బాల్యం, విద్యార్థి దశలో రాసిన కవితల సమాహారంగా ఇది ఆమె సాహిత్య ప్రయాణానికి తొలి చిరునామాగా నిలిచింది.

'కనురెప్పల మాటున' లో మహిళల అస్తిత్వం, సామాజిక అసమానతలు, అణచివేత, వివక్ష, రాజకీయ పరిణామాలపై ఆమె స్పందనలు కవిత్వ రూపంలో కనిపిస్తాయి. ఈ సంపుటికి 2025లో ప్రతిష్ఠాత్మక కుందుర్తి పురస్కారం లభించడం విశేషం. పునఃప్రారంభమైన ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి మహిళా కవయిత్రిగా ఆమె ప్రత్యేక గుర్తింపు పొందారు.



'ప్రపంచ స్త్రీల కవిత్వం' ఆమె సాహిత్య ప్రయాణంలో మరో విశిష్టమైన ప్రయత్నం. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన మహిళా కవయిత్రుల అనుభవాలు, ఆవేదనలు, ప్రతిఘటనలను తెలుగు పాఠకులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ గ్రంథాన్ని రూపొందించారు. దాదాపు 20 నుంచి 30 దేశాలకు చెందిన కవయిత్రులు హిందీ, ఆంగ్లం, మరాఠీ, ఉర్దూ భాషల్లో రాసిన 70 నుంచి 80 కవితలను తెలుగులోకి అనువదించారు.

పితృస్వామ్యం, లైంగిక హింస, దేవదాసీ వ్యవస్థ, ఆదివాసీ జీవితాలు, లైంగిక వైవిధ్యం వంటి విభిన్న అంశాలను ఈ అనువాదాల ద్వారా తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. భౌగోళిక సరిహద్దులు వేరైనా మహిళలు ఎదుర్కొంటున్న అణచివేతలో ఉన్న సారూప్యతలను ఈ పుస్తకం ఆవిష్కరిస్తుంది. అనువాదం అంటే పదాలను మార్చడం మాత్రమే కాదని, మూల రచనలోని భావాన్ని, ఆవేదనను, సామాజిక నేపథ్యాన్ని మరో భాషలో సహజంగా అందించడమేనని ఆమె విశ్వసిస్తారు.

'ఊరి చివరి మనిషి' ఒక మాజీ పోలీసు అధికారి ఆత్మకథ. ఆయన జీవితంలోని వ్యక్తిగత, కుటుంబ, వృత్తిపరమైన అనుభవాలను అక్షరబద్ధం చేసిన రచన ఇది. తొలుత ఇంత పెద్ద జీవితకథను రాయగలనా అనే సందేహం ఉన్నప్పటికీ, ఒక పేజీ రాసి చూయించలన్న ఆ అధికారి సూచనతో మొదలైన ప్రయత్నం, నా మిత్రుడి ప్రోత్సాహం, సహకారం తో పూర్తిస్థాయి పుస్తకంగా రూపుదిద్దుకుంది.ఒక కవయిత్రిగా ప్రారంభమైన ఆమెను జీవిత చరిత్ర రచయిత్రిగా పరిచయం చేసిన పుస్తకమిది.

'పాలీవాలెంట్ యాంటీవెనమ్ నేను!' ఆమె తాజా కవితా సంపుటి. కుల అసమానతలు, మతపరమైన వివక్ష, దళితులపై దాడులు, మహిళల అణచివేత, దోపిడీ, రాజకీయ వ్యవస్థలోని వైరుధ్యాలు ఇందులో ప్రధాన ఇతివృత్తాలుగా ఉన్నాయి. సమాజంలో విషంలా వ్యాపించిన వివక్షలకు, ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా నిలిచే చైతన్యానికి ప్రతీకగా ఈ శీర్షికను ఎంచుకున్నారు. అనేక రకాల సామాజిక విషాలకు ఎదురొడ్డి నిలిచే అక్షర చైతన్యమే ఈ సంపుటి అంతరార్థం.

కవిత్వంలో స్త్రీ స్వరం.. రచనల్లో సామాజిక ప్రతిఘటన!

దియా విఘ్నేష్ రచనల్లో ప్రధానంగా కనిపించే అంశం సామాజిక బాధ్యత. మహిళలపై అణచివేత, కుల వివక్ష, దళితులపై దాడులు, మతపరమైన అసమానతలు, పితృస్వామ్య భావజాలం, ఆర్థిక దోపిడీ వంటి అంశాలపై ఆమె కలం నిరంతరం స్పందిస్తుంది.

ప్రేమ, విరహం, వ్యక్తిగత భావోద్వేగాలకే తన రచనలను పరిమితం చేయకుండా సమాజంలోని అట్టడుగు వర్గాల జీవితాలను, మహిళల సంఘర్షణలను, ఆధిపత్య వ్యవస్థల స్వరూపాన్ని అక్షరాల్లో ఆవిష్కరించాలనేది ఆమె అభిమతం. మహిళా, విద్యార్థి సంఘాలతో కలిసి పనిచేసిన అనుభవాలు కూడా ఆమె రచనా దృక్పథాన్ని ప్రభావితం చేశాయి.

ఆమె దృష్టిలో సాహిత్యం అధికారానికి అనుకూలంగా నిలిచే సాధనం కాదు.. అధికారాన్ని, అన్యాయాన్ని ప్రశ్నించే శక్తి. మూఢనమ్మకాలకు బదులు శాస్త్రీయ దృక్పథాన్ని, ఆధిపత్యానికి బదులు సమానత్వాన్ని, అణచివేతకు బదులు స్వేచ్ఛను సమర్థించే సాధనం.

కలం నుంచి న్యాయస్థానం వరకు.. మరో లక్ష్యం!

సాహిత్యరంగంలో తనదైన గుర్తింపు పొందుతున్న దియా విఘ్నేష్ భవిష్యత్తులో న్యాయవాద వృత్తిలోనూ కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు. ఇప్పటికే న్యాయశాస్త్ర పట్టా పూర్తి చేసిన ఆమెకు న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేయాలన్నది చిరకాల స్వప్నం.

ఆర్థిక స్థోమత లేక న్యాయం కోసం పోరాడలేకపోతున్న సామాన్యులకు అండగా నిలవాలన్నది ఆమె ఆశయం. న్యాయం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎంతోమంది వెనుకడుగు వేస్తున్నారని ఆమె భావిస్తున్నారు. అలాంటి బాధితుల తరఫున తన వంతుగా న్యాయపోరాటం చేయాలనుకుంటున్నారు.

ఇప్పటివరకు ప్రధానంగా కవిత్వంపై దృష్టి సారించిన ఆమె ఇకపై కథా సాహిత్యం, నవలా రచన వైపు కూడా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే ఒక కథల సంపుటి, ఒక నవల రచనా దశలో ఉన్నాయి. ఈ రెండు పుస్తకాలు కూడా త్వరలో పాఠకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రక్రియ ఏదైనా సమాజంలోని మనుషుల జీవితాలు, కుటుంబ వ్యవస్థలోని వైరుధ్యాలు, స్త్రీల అస్తిత్వం, మానవ సంబంధాలు తన రచనల్లో ప్రధానంగా ఉంటాయని ఆమె చెబుతున్నారు.

మార్పు కోసం పరితపించే అక్షర ప్రయాణం!

తన రచనలు చదివిన ప్రతి ఒక్కరూ మారిపోతారని ఆమె ఆశించరు. కానీ ఒక రచన పది మందిని ఆలోచింపజేసి, వారిలో ఇద్దరి ఆలోచనా విధానంలోనైనా మార్పు తీసుకురాగలిగితే రచయిత్రిగా అంతకంటే గొప్ప సంతృప్తి మరొకటి ఉండదని ఆమె అభిప్రాయం. ఐదు పుస్తకాల ప్రచురణ, కుందుర్తి పురస్కార గౌరవం, ప్రపంచ మహిళా కవయిత్రుల రచనలను తెలుగు పాఠకులకు పరిచయం చేసిన అనువాద ప్రయత్నం.. ఇవన్నీ ఆమె సాహిత్య ప్రయాణంలోని ముఖ్యమైన మైలురాళ్లు. అయితే గుర్తింపులకంటే సమాజాన్ని ప్రశ్నించే రచనలు చేయడానికే ఆమె ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకవైపు అధ్యాపకురాలిగా విద్యార్థులకు జ్ఞానాన్ని అందిస్తూ.. మరోవైపు రచయిత్రిగా సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూ.. భవిష్యత్తులో న్యాయవాదిగా బాధితుల పక్షాన నిలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న దియా విఘ్నేష్ ప్రయాణం స్ఫూర్తిదాయకం. ఆమె కలం కేవలం కవిత్వం రాయడం లేదు.. సమాజంలోని మౌనాన్ని ప్రశ్నిస్తోంది. ఆమె అక్షరాలు కేవలం భావాలను పలకడం లేదు.. అణచివేతకు గురైన గొంతుకలకు ప్రతిధ్వనిగా నిలుస్తున్నాయి. అక్షరమే ఆయుధంగా.. ఆలోచనే ఆచరణగా.. సమానత్వమే గమ్యంగా సాగుతున్న దియా విఘ్నేష్ సాహిత్య ప్రయాణం మరిన్ని కొత్త రచనలకు, సామాజిక చైతన్యానికి వేదిక కావాలని ఆశిద్దాం.



ఇందిరమ్మ కుటుంబ బీమా నమోదులో అర్హుల వివరాలు పక్కాగా ఉండాలి!



- **వెంకటాపూర్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**
- **లబ్ధిదారులు,నామినీ వివరాల్లో తప్పులకు తావివ్వొద్దని అధికారులకు ఆదేశం**

హనుమకొండ, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి గ్రామాల్లోని అర్హులందరి వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.బుధవారం దామెర మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కోసం లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన లబ్ధిదారు మోర్తాల శ్రీనివాస్ వివరాలను బీమా నమోదు కోసం అంతర్జాలంలో నమోదు చేస్తుండగా స్వయంగా పరిశీలించారు.నమోదు ప్రక్రియ పూర్తయిన అనంతరం లబ్ధిదారుడి ఫోన్‌కు వచ్చిన సందేశాన్ని కూడా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన వారందరికీ పథకంపై అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీమా నమోదు సమయంలో లబ్ధిదారుల వ్యక్తిగత వివరాలతో పాటు నామినీ వివరాలను కూడా జాగ్రత్తగా నమోదు చేయాలని, చిన్న పాటి పొరపాట్ల వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

గ్రామ అభివృద్ధి పనులు, అంగన్‌వాడీ సేవల పరిశీలన:

అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా స్వయం సహాయక సంఘాల గ్రామ సమాఖ్య భవనాన్ని కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. భవనానికి సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతిరోజూ ఎంతమంది పిల్లలు కేంద్రానికి హాజరవుతున్నారు, వారికి నిర్ణీత మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా అనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో తాగునీటి సదుపాయాలు, నీటి శుద్ధి యంత్రం పనితీరును పరిశీలించి తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంచగిరి రాజు, స్థానిక తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీ దేవి, సంబంధిత అధికారులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేను వేగవంతం చేయాలి!



- **రైతులకు భూముల విస్తీర్ణంపై స్పష్టతనివ్వాలి**
- **అదనంగా మరో రోవర్ కేటాయింపు**
- **కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

హనుమకొండ, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు): గ్రామాల్లో కొనసాగుతున్న భూముల పునఃసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి రైతుకు తన భూమి విస్తీర్ణంపై స్పష్టమైన వివరాలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. భూముల కొలతల్లో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని సూచించారు.బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం వెంకటాపూర్ గ్రామంలో భూముల కొలతల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల పునఃసర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు గ్రామంలో ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేశారు, ఇంకా ఎంత విస్తీర్ణం సర్వే చేయాల్సి ఉంది, ప్రక్రియను ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారనే వివరాలను సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. భూముల కొలతలు చేపడుతున్న విధానం, సాంకేతిక పరికరాల వినియోగం, సర్వే పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

రైతులకు భూముల విస్తీర్ణంపై స్పష్టత ఇవ్వాలి: ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూముల పునఃసర్వేలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి భూమిని కచ్చితమైన కొలతలతో సర్వే చేసి, ప్రక్రియ పూర్తయిన అనంతరం సంబంధిత రైతులకు వారి సాగు భూమి విస్తీర్ణం ఎంత ఉందనే విషయంపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు. సర్వేలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు.

సర్వే వేగం పెంచేందుకు అదనంగా రోవర్ కేటాయింపు:

భూముల పునఃసర్వేను మరింత వేగవంతం చేసేందుకు అదనంగా మరో రోవర్‌ను కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ వెంకటాపూర్‌లో సర్వేను త్వరగా పూర్తి చేయాలని, అదే సమయంలో మరో గ్రామంలోనూ భూముల పునఃసర్వే ప్రక్రియను ప్రారంభించాలని సర్వేయర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో వెంకటాపూర్, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల గ్రామాల సర్పంచులు పంచగిరి రాజు, చంద్రం, రవి యాదవ్, భూముల కొలతల శాఖ సహాయ సంచాలకుడు నూర్ సింగ్, స్థానిక తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీ దేవి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సతీష్ చంద్ర, లైసెన్సు పొందిన సర్వేయర్లు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in